ప్రతిపక్షం

www.prathipaksham.in

మంగళవారం 06.01.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 287 పేజీలు:8 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu



ఐపీఎల్‌పై 'బంగ్లా' నిషేధం 8



వ్యక్తిగా సభను నుండి వెళ్తున్నా..

తెలంగాణ కోసం శక్తిగా తిరిగి వస్తా

శాసన మండలిలో కవిత సంచలన ప్రసంగం

తెలంగాణ ఏర్పడిన తర్వాత పార్టీ లోపల తన భావ ప్రకటనకు ఆంక్షలు విధించారు. అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, కార్మికులు, టీచర్లు వంటి సామాన్యుల సమస్యల కోసం మాట్లాడితే నిర్లక్ష్యం చేశారు. అవినీతి అంశాలను కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోలేదు. అమర జ్యోతి, సచివాలయం, అంబేడ్కర్ విగ్రహం, కలెక్టరేట్ల నిర్మాణాల్లో అవినీతి జరిగింది. ధర్నా చౌక్ తొలగింపును ప్రశ్నించా.... రైతులకు బేడీలు వేయడం నన్ను బాధించింది. బీఆర్ఎస్‌ను ప్రశ్నించడమే తన తప్పుగా మారింది. అదే కారణంగా కుట్ర చేసి పార్టీ నుంచి బయటకు పంపారు. నోటీసులు ఇవ్వకుండా, వివరణ అడగకుండా రాత్రికి రాత్రే సస్పెండ్ చేయడం ప్రజాస్వామ్య విరుద్ధ చర్య.

లక్ష్మీ నరసింహస్వామి మీద, నా పిల్లల మీద ఒట్టేసి చెబుతున్నా... ఇది పూర్తిగా ఆత్మగౌరవ పోరాటమే.

- కల్వకుంట్ల కవిత

- శాసన మండలిని కుదిపేసిన కవిత నిర్ణయం
- శాసన మండలికి కవిత గుడ్‌బై
- బీఆర్ఎస్ పై విమర్శలు, కొత్త రాజకీయ దిశ
- అడుగడుగునా ఆంక్షలు విధించారంటూ కంటతడి
- తనది ఆస్తి కోసం పోరాటం కాదు.. ఆత్మగౌరవ పోరాటమని ఆవేదన

చిటుకుల మైసారెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి5: తెలంగాణ రాజకీయాల్లో ఒక్కసారిగా భూకంపం లాంటి పరిణామం చోటు చేసుకుంది. బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీ కవిత శాసన మండలిలో చేసిన భావోద్వేగ ప్రసంగం రాష్ట్ర రాజకీయాలను పూర్తిగా వేడెక్కించింది. రాజ్యాంగ స్ఫూర్తి, నైతికత లేని పార్టీగా బీఆర్ఎస్‌ను తీవ్రంగా విమర్శిస్తూ, తన రాజకీయ ప్రయాణంలో ఎదుర్కొన్న అన్యాయాలను ఏకరువు పెట్టారు. ప్రసంగం మధ్యలో కన్నీళ్లు పెట్టుకున్న కవిత, "ఈ సభ నుంచి నేను ఒక వ్యక్తిగా వెళ్తున్నా... భవిష్యత్‌లో శక్తిగా తిరిగి వస్తా'' అంటూ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. గత ఏడాది సెప్టెంబర్ మూడవ తేదీన తాను ఎమ్మెల్సీ పదవికి రాజీనామా సమర్పించిన విషయాన్ని కవిత గుర్తు చేశారు. అది పూర్తి అవగాహనతో తీసుకున్న నిర్ణయమని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ ద్వారా వచ్చిన పదవితో తనకు చేయాల్సిన పనులకు అడ్డంకులు ఏర్పడినప్పుడు ఆ పదవిలో కొనసాగటం నైతికం కాదని పేర్కొన్నారు. తన రాజీనామాకు కారణాలు సభలో చెప్పేందుకు అవకాశం ఇచ్చినందుకు చైర్మన్‌కు ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ఉద్యమం నుంచి తన రాజకీయ ప్రయాణం ప్రారంభమైందని వివరించిన కవిత, కేసీఆర్, ప్రొఫెసర్ జయశంకర్ స్ఫూర్తితో 2006లో ఉద్యమంలోకి వచ్చానని చెప్పారు. రాజకీయ పార్టీగా టీఆర్ఎస్ అప్పటికే ఎదిగినా, తాను

...:: మిగతా 2లో



అసెంబ్లీ ఎన్నికల నాటికి రాజకీయ పార్టీగా జాగృతి

- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 5: వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి పొలిటికల్ పార్టీగా తెలంగాణ జాగృతి ఎదుగుతుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. గన్ పార్క్ వద్ద సోమవారం తెలంగాణ అమరవీరులకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి జాగృతి పొలిటికల్ పార్టీగా ఎదుగుతుందని

...:: మిగతా 2లో



సముద్ర ప్రతాప్ నౌక జలప్రవేశం

భారతీయ కోస్టు గార్డుకు చెందిన సముద్ర ప్రతాప్నౌక సోమవారం జలప్రవేశం చేసింది. గోవాలో జరిగిన కార్యక్రమంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాల్గొన్నారు. సముద్ర ప్రతాప్‌ను పొల్యూషన్ కంట్రోల్ వెసల్‌గా వర్ణిస్తున్నారు. ఈ నౌకను స్వదేశీయంగా తయారు చేశారు.

7



వెనిజులా ఆపరేషన్‌లో మృతులు 80


వెనిజులా దేశాధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా నిర్బంధించిన విషయం తెలిసిందే. ఆ ఆపరేషన్‌లో ఇప్పటి వరకు మృతిచెందిన వారి సంఖ్య 80కి చేరుకున్నది. మృతుల్లో సైనికులు, సాధారణ పౌరులు కూడా ఉన్నట్లు న్యూయార్క్ టైమ్స్ పేర్కొన్నది.

7

పోలవరం-నల్లమలను ముమ్మాటికి అడ్డుకుంటాం

- సిడబ్ల్యుసి, జీఆర్ఎంబీ,పర్యావరణ, అటవీశాఖలతో పాటు కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖాలకు వ్యతిరేకిస్తూ లేఖలు
- హరీష్ రావు చూపించిన లేఖను సీడబ్ల్యూసీ ఆమోదించలేదు
- బీఆర్ఎస్ ఆరోపణలు అర్థరహితం
- మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో



హైదరాబాద్, జనవరి5: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన పోలవరం, నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టు నిర్మాణాన్ని ఎట్టి పరిస్థితుల్లోను అంగీకరించే ప్రసక్తేలేదని, ఖచ్చితంగా అడ్డుకుని తీరుతామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తేల్చి చెప్పారు. ఏపీ ప్రభుత్వం ప్రతిపాదనలు ముమ్మాటికి గోదావరి జల వివాద ట్రిబ్యునల్ 1980 అవార్డ్ తో పాటు అంతరాష్ట్ర జల నిబంధనలు ఉల్లంఘించడమే నని ఆయన స్పష్టం చేశారు. సోమవారం

...:: మిగతా 2లో



వరద జలాల పేరుతో అసలుకు ఎసరు

- ఏకపక్షంగా పోలవరం నల్లమల సాగర్ లింక్
- 200 టీఎంసీలు తరలించుకునేందుకు ఏపీ యత్నం
- 480 టీఎంసీలను మించి వాడుకునే ప్లాన్
- సుప్రీంకోర్టులో తెలంగాణ తరపున సింఘ్వీ వాదనలు
- ఏపీ తరపున వాదనలు వినిపించిన ముకుల్ రోహిత్గీ
- మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవాలన్న సుప్రీం
- విచారణ వచ్చే సోమవారానికి వాయిదా

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో

న్యూఢిల్లీ, జనవరి 5: గోదావరిలో వరద జలాల పేరుతో అసలు జలాలకు ఎసరు పెట్టాలని ఏపీ ప్రయత్నిస్తోంద ని సుప్రీంకోర్టులో తెలంగాణ తరపు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. ఏపీ నిర్మిస్తున్న పోలవరం నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టు కేసు విచారణ సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఎదుట జరిగింది. తెలంగాణ తరపున సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. నల్లమల సాగర్ ద్వారా గోదావరి జలాల్లో అవార్డు ప్రకారం కేటాయించిన 480 టీఎంసీలకు మించి వాడుకునేందుకు ఏపీ యత్నిస్తోందన్నారు. వరద జలాల పేరుతో నీటిని తరలించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. 200 టీఎంసీలు

...:: మిగతా 2లో



పీవోకే సహా జమ్మూ కశ్మీర్‌ను భారత్‌లో విలీనం చేయాలి

జమ్మూకశ్మీర్ పై బ్రిటన్ ఎంపీ బాబ్ బ్లాక్‌మన్ కీలక వ్యాఖ్యలు చేశారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ తో సహా జమ్మూకశ్మీర్ మొత్తాన్ని భారత్‌లో విలీనం చేయాలని అన్నారు.

7



ఏపీలో ఓఎన్జీసీ గ్యాస్ లీక్..

అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురంలో ఘటన

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 5: ఏపీలోని అంబేడ్కర్ కోనసీమ జిల్లా, మలికిపురంలో ఓఎన్జీసీ గ్యాస్ లీకవుతోంది. దీంతో అక్కడ భారీగా మంటలు ఎగసిపడుతున్నాయి. దాదాపు వంద అడుగుల ఎత్తువరకు మంటలు వ్యాపించాయి. ఓఎన్జీసీ డిగ్గింగ్ ప్లేస్ నుంచి గ్యాస్ లీకైంది. దాదాపు మూడు గంటల నుంచి మంటలు ఎగసిపడుతుండటంతో అక్కడి కొబ్బరి చెట్లు, పొలాలు భారీగా తగలబడిపోతున్నాయి. స్పందించిన అధికారులు మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ముందుజాగ్రత్త చర్యగా స్థానిక ప్రజలను ఖాళీ చేయిస్తున్నారు. ఈ విషయాన్ని ఓఎన్జీసీ ఉన్నతాధికారులకు తెలియజేసినట్లు తహశీల్దార్ శ్రీనివాస రావు తెలిపారు. మంటలను అదుపు చేసేందుకు పెద్ద ఎత్తున ఫైర్ ఇంజన్లతో సిబ్బంది, పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మరోవైపు ఓఎన్జీసీ సాంకేతిక నిపుణుల బృందం కూడా అక్కడికి చేరుకుంది. ప్రస్తుతం ఇరుసుమండ ప్రాంతంలో ఉన్న కొబ్బరిచెట్లు భారీగా దగ్ధమవుతున్నాయి. ఇప్పటికే 500పైగా కొబ్బరి చెట్లు కాలిపోయినట్లు స్థానికులు తెలిపారు. అక్కడికి ఐదు కిలోమీటర్ల పరిధిలోని ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. పరిస్థితిని స్థానిక ఎంపీ, జిల్లా కలెక్టర్, ఎస్పీ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఈ ఘటనపై ఏపీ సీఎం చంద్రబాబు స్పందించారు. తగిన సహాయక చర్యలు తీసుకోవాలని మంత్రులు అచ్చెన్నాయుడు, సుభాష్ ను ఆదేశించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అక్కడ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది.

నేను సంతోషంగా లేనని మోడీకి తెలుసు

- రష్యాతో వ్యాపారం కొనసాగిస్తే భారత్‌పై మరిన్ని సుంకాలు
- ట్రంప్ సంచలన వ్యాఖ్యలు



ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

న్యూఢిల్లీ, జనవరి 5: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రధాని మోదీని ఒకవైపు ప్రశంసిస్తూనే మరోవైపు నుంచి చురకలు అంటించారు. మోదీ చాలా మంచి వ్యక్తి అని పొగుడ్తూనే.. తనకు నచ్చినట్లుగా చేయకపోతే సుంకాలు పెంచుతానని హెచ్చరించారు. వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో విషయంలో చేపట్టబోయే చర్యల గురించి చెబుతున్న వేళ ట్రంప్ భారత్ గురించి కూడా ప్రస్తావించారు. రష్యా చమురు కొనుగోళ్లను భారత్ తగ్గించిందని.. తనను సంతోషపెట్టేందుకే భారత ప్రధాని మోదీ ఈ నిర్ణయం తీసుకున్నారని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తెలిపారు. " వాళ్లు నన్ను సంతోషపెట్టాలని

...:: మిగతా 2లో





మేడారం జాతరకు రండి

మేడారం జాతరకు రావాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మంత్రులు ఆహ్వానించారు. ఈ మేరకు రాజ్‌భవన్‌లో మంత్రులు సీతక్క, కొండా సురేఖ, జాతర ప్రతినిధులు కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. జాతర విశిష్టతను గవర్నర్‌కు వివరించారు. సీఎం రేవంత్ రెడ్డికి ఆయన నివాసంలో మంత్రులు సీతక్క, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు కలిసి మేడారం జాతర ఆహ్వాన పత్రికను అందజేశారు.

- ప్రతిపక్షం, హైదరాబాద్



ట్రంప్ భయపెట్టేందుకు యత్నిస్తున్నాడు

వెనెజువెలా లో నెలకొన్న పరిస్థితి ఈ ప్రపంచానికి మంచిది కాదని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. ట్రంప్ ఈ ప్రపంచంలోని జనాభాను భయపెట్టే ప్రయత్నం చేస్తున్నాడని విమర్శించారు.

7

రాష్ట్రీయం

అసెంబ్లీ ఎన్నికల నాటికి

రాజకీయ పార్టీగా జాగృతి

మొదటిపేజీ తరువాయి

పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల తరపున నిలబడి పోరాటం చేస్తూ ఒక శక్తిగా ఎదుగుతుందని చెప్పారు. లెఫ్ట్ పార్టీల సోదరులు, మావోయిస్టు సానుభూతి పరులు, మనుగడ కొనసాగించలేక పోతున్న మావోయిస్టులు, ప్రజాస్వామ్య పద్ధతిలో పనిచేసే పార్టీ రావాలనుకుంటున్న ప్రతి ఒక్కరూ తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. తెలంగాణ కోసం పోరాటం చేసిన లక్షలాది మంది ఉద్యమకారులకు బీఆర్ఎస్ లో ఇసుమంత కూడా గౌరవం దక్కలేదన్నారు. అనేక పదవులు ఉన్నప్పటికీ వారికి పదవులు ఇవ్వాలని గుర్తుకు రాకపోవటం విచారకరమని పేర్కొన్నారు. ఉద్యమంలో వేలాది మంది ఆడబిడ్డలు పనిచేస్తే వారికి అవకాశాలే రాలేదన్నారు. ఒకరిద్దరు తన లాంటి వాళ్లకు మాత్రమే అవకాశం వచ్చిందన్నారు. అవకాశం వచ్చినప్పటికీ తనను చిత్రహింసలు, నానా అవమానాలకు గురి చేసి రాజకీయంగా ఎదగకుండా చేశారని ఆరోపించారు. అలా చేసి ఆ పార్టీ ఏం సాధించుకుందో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. తొమ్మిదిన్నరేళ్లలో రూ.14 లక్షల కోట్ల బడ్జెట్ పెట్టి రూ.12 లక్షల కోట్లు ఖర్చు చేశారని, ఒక్క ఇరిగేషన్ కోసమే రూ.లక్షా 89 వేల కోట్లకు పైగా ఖర్చు చేశారన్నారు. పేద ప్రజలకు మాత్రం ఇళ్లు ఎందుకు ఇవ్వలేక పోయారో చెప్పాలని డిమాండ్ చేశారు. కొంతవరకు మంచి జరిగినా ,ఇది శాశ్వతంగా ఉండేలా చేయలేదన్నారు. తెలంగాణ వచ్చాక పెద్ద ఎత్తున మంచి జరుగుతుందని ఇంకా ఎంతో చేస్తారని ప్రజలకు ఆశలు ఉండేవన్నారు. కానీ వారి ఆశలన్నింటినీ అడియాశలు చేశారని విమర్శించారు. ఉద్యమకారులు తమకు గుర్తింపు కార్డులు ఇచ్చి గౌరవించాలని ఆశిస్తే అది కూడా చేయలేదన్నారు. ఇక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గత రెండేళ్లుగా మహిళలను, నిరుద్యోగులను, ఉద్యమకారులను మోసం చేస్తోందని ఆరోపించారు. పన్నెండేళ్లుగా ఈ రెండు పార్టీలు ప్రజలను మభ్య పెట్టి విపరీతంగా మోసం చేశాయని విమర్శించారు.రాష్ట్రంలో తెలంగాణ పేరును తనలో నింపుకొని తెలంగాణ అస్తిత్వం కోసం పోరాడే పార్టీ రావాల్సి ఉందన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ రాని విద్యార్థులు పిడికిలెత్తి పోరాటం చేసేందుకు జాగృతిలో చేరాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగులకు కొత్త ఉపాధి అవకాశాలు కావాలంటే తనతో పాటు పోరాడాలని కోరారు. అదివాసీ, గిరిజన, దళిత, మైనార్టీ బిడ్డల కోసం పోరాటం చేసే పార్టీ కావాలన్నారు. అన్నింటికన్నా ఆడబిడ్డల హక్కులు, అస్తిత్వం కోసం పోరాటం చేసే తనను దీవించాలని కోరారు. తాను ఒక ఆడబిడ్డగా ముందడుగు వేస్తున్నానని, దీవించి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ఎలాంటి పొలిటికల్ బ్యాక్‌గ్రౌండ్ లేని యువత, మహిళలు కూడా రాష్ట్ర రాజకీయాలను మార్చేస్తామని భావించాలని పిలుపునిచ్చారు. అలాంటి వారి కోసం ఒక రాజకీయ వేదిక తాను ఇస్తానని పేర్కొన్నారు. అన్ని బంధాలు, బంధానాలు తెంచుకొని అవమాన భారంతో ఇంటి పార్టీ నుంచి బయటకు వచ్చానని చెప్పారు.

తెలంగాణ కోసం శక్తిగా తిరిగి వస్తా

మొదటిపేజీ తరువాయి



'జాగృతి' సంస్థ ద్వారా మహిళలు, యువతను ఉద్యమంలోకి తీసుకొచ్చేందుకు పని చేశానన్నారు. బతుకమ్మ పండుగను తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీకగా నిలిపేందుకు ఎనిమిదేళ్ల పాటు కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి కోసం పుస్తకాలు విడుదల చేశామని గుర్తు చేశారు. అప్పటి పాఠ్యపుస్తకాల్లో తెలంగాణ మహనీయుల చరిత్ర లేకపోవడాన్ని ప్రశ్నించామని పేర్కొన్నారు. శ్రీకృష్ణ కమిటీ ముందు తెలంగాణకు జరిగిన అన్యాయాలను వివరించామని చెప్పారు. 2013-14 లో తెలంగాణ ఏర్పాటు కీలక దశలో ఉన్నప్పుడు ఢిల్లీలో కుటుంబంతో కలిసి రెండు నెలల పాటు పోరాటం చేశామని చెప్పారు. కాంగ్రెస్ నేతలు పట్టించుకోని సమయంలో కేసీఆర్‌కు కీలక సమావేశాలు ఏర్పాటు చేయడంలో తన పాత్ర ఉందని వెల్లడించారు. పార్లమెంట్ లో తెలంగాణ బిల్లు పాస్ కావడంలో తానూ భాగస్వామినేనని స్పష్టం చేశారు. తాను రాజకీయాల్లోకి రావాలని ఎప్పుడూ అనుకోలేదని, అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ నడపాలన్న ఆలోచన మాత్రమే ఉందని చెప్పారు. కానీ బీఆర్ఎస్ నాయకులే పిలిచి నిజామాబాద్ ఎంపీ టికెట్ ఇచ్చారని తెలిపారు. పిల్లలను వదిలి రాజకీయాల్లోకి రావాలంటే ఏ మహిళ అయినా ఆలోచిస్తుందని చెప్పారు. నాలుగు నెలల పాటు కుటుంబంతో చర్చించిన తర్వాతే నిర్ణయం తీసుకున్నానన్నారు. ఎప్పుడూ టికెట్ అడుక్కోలేదని, ప్రజలే తనను గెలిపించారని చెప్పారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత పార్టీ లోపల తన భావ ప్రకటనకు ఆంక్షలు విధించారని కవిత ఆరోపించారు. అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, కార్మికులు, టీచర్లు వంటి సామాన్యుల సమస్యల కోసం మాట్లాడితే నిర్లక్ష్యం చేశారని తెలిపారు. అవినీతి అంశాలను కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోలేదని తెలిపారు. అమర జ్యోతి, సచివాలయం, అంబేడ్కర్ విగ్రహం, కలెక్టరేట్ల నిర్మాణాల్లో అవినీతి జరిగిందని సంచలన ఆరోపణలు చేశారు. ధర్నా చౌక్ తొలగింపును ప్రశ్నించానని అన్నారు. రైతులకు బేడీలు వేయడం తనను బాధించిందన్నారు. బీఆర్ఎస్‌ను ప్రశ్నించడమే తన తప్పుగా మారిందని వాపోయారు. అదే కారణంగా కుట్ర చేసి పార్టీ నుంచి బయటకు పంపారని విమర్శించారు. తనకు నోటీసులు ఇవ్వకుండా, వివరణ అడగకుండా రాత్రికి రాత్రే సస్పెండ్ చేయడాన్ని ప్రజాస్వామ్య విరుద్ధ చర్యగా అభివర్ణించారు. బీఆర్ఎస్ పార్టీ రాజ్యాంగం ఎనిమిది పేజీలే ఉండటం ఒక జోక్‌లా ఉందని వ్యాఖ్యానించారు. నైతికత లేని పార్టీపై లీగల్‌గా ఛాలెంజ్ చేయదలచుకోలేదని, ఆ పార్టీ నుంచి బయటకు రావటం తనకు సంతోషంగా ఉందని చెప్పారు. తన సస్పెన్షన్‌ను ఆస్తుల పంచాయితీగా కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. లక్ష్మీ నరసింహస్వామి మీద, తన పిల్లల మీద ఒట్టేసి చెబుతున్నానని... ఇది పూర్తిగా ఆత్మగౌరవ పోరాటమేనని స్పష్టం చేశారు. ఈడీ, సీబీఐ కేసుల్లో జైలుకు వెళ్లినప్పుడు పార్టీ అండ లేకుండా ఒంటరిగా పోరాడిన విషయాన్ని గుర్తు చేస్తూ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. మహిళల ప్రాతినిధ్యం తెలంగాణలో అత్యంత తక్కువగా ఉందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. 17 ఎంపీ స్థానాల్లో ఒక్క మహిళ మాత్రమే ఉండటం, 119 ఎమ్మెల్యేల్లో కేవలం ఎనిమిది మంది మహిళలే ఉండటం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమన్నారు. "ఒక ఆడబిడ్డగా తాను ముందడుగు వేస్తున్నానని ఆశీర్వదించండి" అంటూ సభను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు హృదయాలను తాకాయి. ఈ సభ నుంచి వ్యక్తిగా వెళ్తున్నానని, కానీ భవిష్యత్‌లో ప్రజల పక్షాన శక్తిగా తిరిగి వస్తానని కవిత ప్రకటించారు. తెలంగాణ కోసం పనిచేసే కొత్త రాజకీయ పంథాను నిర్మిస్తానని, రాబోయే ఎన్నికల్లో ప్రజల ఆకాంక్షలకు ప్రతినిధిగా నిలుస్తానని స్పష్టం చేశారు. కవిత చేసిన ఈ ప్రకటనతో రాష్ట్ర రాజకీయాలు కొత్త మలుపు తిరిగినట్లుగా మారాయి.

మామ, అల్లుడిని వందసార్లు ఉరితీయాలి

- నిత్యం పచ్చి అబద్ధాలతో ప్రజలను అయోమయంలో వేసే చర్యలు
- పదేళ్లలో జలాల విషయంలో రాష్ట్రానికి తీరని అన్యాయం
- ఇక పెద్ద గొంతు చేసుకొని ప్రజా ప్రభుత్వంపై విమర్శలు
- ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 5: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్రానికి అన్ని రంగాల్లో అన్యాయం చేసినందుకు కేసీఆర్, హరీశ్ రావు, కేటీఆర్ ను వంద సార్లు ఉరితీయాల్సిన పరిస్థితి ఉందని తెలంగాణ ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం గాంధీభవన్ లో మీడియా ప్రతినిధుల సమావేశంలో సాయి మాట్లాడుతూ పదేళ్లలో తెలంగాణ సెంటిమెంటును అడ్డం పెట్టుకొని మాయ మాటలతో గారడి చేసిన బీఆర్ఎస్ పార్టీ నేతలు నేడు ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు మేలు జరుగుతుంటే ఓర్వలేకపోతున్నారంటూ ధ్వజమెత్తారు. గతంలో కాంగ్రెస్ పార్టీ హామీలు అమలు చేయడంలేదంటూ పత్రాలు తీసుకొని ప్రచారం చేశారని, వారి ప్రచారాన్ని ప్రజలు తిప్పికొట్టడంతో బిత్తరపోయిన మామ, అల్లుడు,కుమారుడు మరో ఎత్తుగడ వేసుకున్నారంటూ ఆరోపించారు. లక్షల కోట్లు వెచ్చించి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కూలి పోవడంతో వాళ్ల మైండ్ బ్లాక్ అయ్యిందని సాయికుమార్ దుయ్యబట్టారు. ప్రస్తుతం పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును ఆసరగా చేసుకొని మరో మారు సెంటిమెంట్ ను తీసుకొస్తున్నారంటూ ఎద్దేవా చేశారు. పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టును నిజంగా నీళ్లు పారాలంటూ జూరాల నుంచి నీటిని తరలించకుండా, శ్రీశైలం వెనుక నుంచి తరలించేందుకు ఎందుకు నిర్ణయించారంటూ సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా అసెంబ్లీ నుంచి మూకుమ్మడిగా పారిపోయారని ఆరోపించారు. వీళ్లు ముగ్గురు తెలంగాణాలోని కవులు, కళాకారులతో పాటు ప్రజలకు తీరని ద్రోహం చేశారని సాయి మండిపడ్డారు. ఇంత ద్రోహం చేసిన కేసీఆర్, హరీశ్,కేటీఆర్ ఏ ముఖం పెట్టుకుని మాట్లాడుతున్నారంటూ ప్రజలు నిలదీసే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ఇప్పటికైనా రాష్ట్రానికి చేసిన ద్రోహానికి ముగ్గురు ప్రజలముందు ముక్కు నేలకు రాసి, ప్రజా ప్రభుత్వ పాలనకు సహకరించాలని మెట్టుసాయి డిమాండ్ చేశారు.

పోలవరం-నల్లమలను ముమ్మాటికి అడ్డుకుంటాం

మొదటిపేజీ తరువాయి

అసెంబ్లీ ప్రాంగణంలో మీడియా ప్రతినిధులతో చిట్ చాట్ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానమిస్తూ మాజీ మంత్రి హరీశ్ రావు చూపిస్తున్న లేఖ సిడబ్ల్యూసి అంతర్గతంగా సమాచారం కోసం పంపిన లేఖ మాత్రమేనని, ఎంత మాత్రం సిడబ్ల్యూసి ఆమోదించినట్లు కాదని ఆయన స్పష్టం చేశారు.

ప్రజలను గందరగోళంలో పడేసేందుకు బీఆర్ఎస్‌గత్తర

తెలంగాణా రాష్ట్ర జల హక్కులపై ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు బీఆర్ఎస్ పార్టీ పూనుకుందని ఆ పార్టీ నాయకులు చేస్తున్న ఆరోపణలు అర్ధరహితమని ఉత్తమ్ కొట్టి పారేశారు. గత పదేళ్లు అధికారంలో ఉండగా రాష్ట్రానికి ఏ మేరకు నష్టం జరిగిందన్న విషయం అసెంబ్లీ ద్వారా ప్రజలకు వివరించడంతో దిమ్మ తిరిగి ఆ పార్టీ నేతలు అసెంబ్లీని బహిష్కరించారని మంత్రి ఆరోపించారు. ప్రజలను గందరగోళంలో పడేయడం, వారు చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకే హరీశ్‌రావు గత్తర, బిత్తర అరుపులు అరుస్తున్నారంటూ ఉత్తమ్ మండిపడ్డారు. పోలవరంనల్లమల ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం జీఆర్ఎంబీ, పోలవరం ప్రాజెక్ట్ అథారిటీతో పాటు కేంద్ర జల కమిషన్, కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ, కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖలకు లేఖలు రాసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. తెలంగాణా ప్రభుత్వ అభిప్రాయంతో పైన పేర్కొన్న సంస్థలన్నీ ఏకీభవించాయని ఆయన తెలిపారు. డిసెంబర్ 4న కేంద్ర జల సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి రాసిన లేఖనే ఇందుకు నిదర్శనమన్నారు. అంతటితో ఆగకుండా భారత సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో న్యాయ పోరాటం చేస్తున్నామని ఆయన వెల్లడించారు. ఇదే ప్రాజెక్టును ఒక్క తెలంగాణా రాష్ట్రం మాత్రమే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలు కుడా ఆక్షేపిస్తున్నాయని ఆయన తెలిపారు.ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో పోరాటం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణా ప్రాంత ప్రయోజనాలను కాపాడడంతో పాటు గట్టి వాదనలు వినిపించేందుకు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ సింగ్విని నియమించిందని ఆయన పేర్కొన్నారు. అయితే ఈ రోజు జరగాల్సిన వాదనలు వచ్చే సోమవారం రోజుకు వాయిదా పడ్డాయని రిట్ పిటిషన్ ను సూట్ పిటిషన్ గా మార్చి దాఖలు చేయాలని సూచించినట్లు ఆయన వెల్లడించారు. వచ్చే సోమవారం జరగనున్న వాదనలకు స్వయంగా తాను హాజరు అవుతానని, మళ్లీ స్టే ఆర్డర్ కోరతామని ఆయన తెలిపారు. ఇదే విషయమై రానున్న రెండు రోజుల్లో న్యాయవాదులతో ప్రత్యేకంగా మరో సమావేశం నిర్వహించి తెలంగాణా రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు అనుసరించాల్సిన వ్యూహాన్ని రూపొందిస్తామన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులను నిలువరించడంలో విజయం సాధించమన్నారు. తెలంగాణా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మీదటనే రాయలసీమ ఎత్తిపోతల పథకానికి బ్రేక్ పడిన విషయాన్ని తెలంగాణా సమాజం గుర్తించుకోవాలన్నారు. కొత్తగా ఏర్పడ్డ తెలంగాణా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన బి.ఆర్.ఎస్ పాలకులు జల వనరుల నిర్వహణలో ఘోరంగా విఫల మయ్యారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు.బి.ఆర్.ఎస్ పాలనలో మాటలకు చేతలకు ఎక్కడ పొంతన లేదని ఆయన విమర్శించారుజూరాల నుండి పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని శ్రీశైలంకు,తుమ్మిడిహట్టి నుండి మెడిగడ్డకు కాళేశ్వరం ఎత్తిపోతల పథకం కింద తుమ్మిడిహట్టి ప్రాజెక్టును రీ,డిజైన్ చేయడం వంటి నిర్ణయాలు తెలంగాణా రాష్ట్ర భవిష్యత్ తరాల మీద మోయలేని భారాన్ని బి ఆర్ ఎస్ పాలకులు మోపారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దుయ్యబట్టారు.

..అసలుకు ఎసరు

మొదటిపేజీ తరువాయి

తరలించేందుకు ఏపీ ప్రయత్నిస్తు న్నదని చెప్పారు. తెలంగాణ కొత్తగా ఏర్పడిన రాష్ట్రమని, అనేక ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయని అన్నారు. వరద జలాలు అనేది ఎక్కడా లేదని అన్నారు. ముఖ్యంగా గోదావరి నదిలో తెలంగాణకు ఉన్న 968 టీఎంసీల నీటి వాటాకు ఈ ప్రాజెక్టు వల్ల ముప్పు పొంచి ఉందన్నారు. కేంద్ర జల సంఘం ఇచ్చిన ఆదేశాలను కూడా ఏపీ పట్టించుకోవడం లేదు అని సింఘ్వీ వాదించారు. ఈ ప్రాజెక్టుపై తక్షణమే స్టే ఇవ్వాలని కోరారు. ఏపీ తరఫున ముకుల్ రోహిత్గీ వాదనలు వినిపిస్తూ.. ఈ ప్రాజెక్టు ఇంకాప్రాథమిక దశలోనే ఉందని, కేవలం డీపీఆర్, సర్వేల కోసం మాత్రమే టెండర్లు పిలుస్తున్నా మని ఆయన స్పష్టం చేశారు. నా ఇల్లు నేను కట్టుకుంటే పక్కవారికి అభ్యంతరం ఏంటీ అనే ఉదాహరణతో రోహత్గి తన వాదన వినిపించారు. రాయలసీమ వంటి కరవు ప్రాంతాలకు నీటిని అందించడమే తమ లక్ష్యమని ఇందులో ఎలాంటి ఉల్లంఘనలు లేవని స్పష్టం చేశారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం మధ్యవర్తిత్వం ద్వారా సమస్యను పరిష్కరించుకునే అవకాశాలను పరిశీలించాలని సూచిస్తూ విచారణ ను సోమవారానికి వాయిదా వేశారు.



నేను సంతోషంగా లేనని మోడీకి తెలుసు

మొదటిపేజీ తరువాయి

భావించారు. ప్రధాని మోదీ చాలా మంచి వ్యక్తి. నేను సంతోషంగా లేనన్న విషయం ఆయనకు తెలుసు. నన్ను సంతోషపెట్టడం చాలా ముఖ్యం. రష్యాతో వారు వ్యాపారం కొనసాగిస్తే.. మనం చాలా వేగంగా టారిఫ్‌లు పెంచుతాం" అని ట్రంప్ హెచ్చరించారు. దీనికి సంబంధించిన ఒక ఆడియా క్లిప్‌ను వైట్ హౌస్ ట్విట్టర్ (ఎక్స్) ఖాతాలో వెల్లడించింది. ప్రపంచ ఆర్థిక పరిస్థితులపై ట్రంప్ మాట్లాడుతూ.. రష్యా ఆర్థిక పరిస్థితి బాగోలేదని తెలిపారు. వెనెజువెలా ఆర్థిక వ్యవస్థ అయితే మరింత దయనీయంగా ఉందన్నారు. తాను చూసిన వాటిలో అత్యంత చెత్త ఆర్థిక వ్యవస్థ వెనెజువెలాదే అని పేర్కొన్నారు. కాగా, భారత్, అమెరికా మధ్య వాణిజ్య చర్చలు జరుగుతున్న వేళ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. అయితే గతంలోనూ రష్యా చమురు కొనుగోళ్లను తగ్గిస్తామని ప్రధాని మోదీ తనతో చెప్పారని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

మహిళా సాధికారతకు సంక్షేమానికి పెద్ద పీట

- మంత్రి సీతక్క



ప్రతిపక్షం, స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి5: తమ ప్రభుత్వం మహిళా సాధికారతకు, సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నదని మహిళా, శిశు సంక్షేమశాఖ, పంచాయితీరాజ్ , గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి దనసరి సీతక్క తెలిపారు. సోమవారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి జబాబిచ్చారు. తెలంగాణలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు మహిళా సాధికారతకు, ప్రజా సంక్షేమానికి గొప్ప ఉదాహరణ గా నిలుస్తున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థిక స్వావలంబన, ఆత్మగౌరవం, సమానత్వం లక్ష్యంగా ప్రారంభించిన ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ఒక సంక్షేమ పథకం కాదు... ఒక సామాజిక విప్లవంగా ముందుకు సాగుతోందని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా 20కి పైగా వ్యాపార రంగాల్లో మహిళలను ప్రోత్సహిస్తూ, ప్రభుత్వం పెద్దన్న పాత్రను పోషిస్తోందని సీతక్క తెలిపారు. మహిళలు కేవలం సహాయకులుగా కాదు... నిర్ణయాలు తీసుకునే స్థాయికి ఎదగాలన్నదే మా ఉద్దేశం అని ఆమే స్పష్టం చేశారు. ఇందులో భాగంగా ప్రారంభించిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు తక్కువ ధరల్లో రుచికరమైన ఆహారం అందించే కేంద్రాలుగానే కాకుండా, మహిళల జీవితాల్లో వెలుగులు నింపే సాధనాలుగా మారాయని తెలిపారు. ఎన్ని ఫైవ్‌స్టార్ హోటళ్ళు ఉన్నా...అమ్మ చేతి రుచి ఎక్కడా దొరకదు. అదే రుచి, అదే మమకారంతో వంటకాలు అందించేందుకు ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు వేదికలుగా నిలుస్తున్నాయని, రుచి, శుచి మాత్రమే కాదు... మహిళల ఆత్మవిశ్వాసానికి, ఆత్మగౌరవానికి ఇవి ప్రతీకలుగా నిలుస్తున్నాయని మంత్రి తెలిపారు. పాలనకు గుండెకాయ లాంటి డా. బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మొదలైన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల ప్రస్థానం... ఒక ఉద్యమంలా మారుమూల ప్రాంతాల వరకూ విస్తరింపచేస్తున్నామని సీతక్క తెలిపారు. కలెక్టరేట్లు, ప్రభుత్వ ఆసుపత్రులు, పర్యాటక కేంద్రాలు, రద్దీ ప్రాంతాల్లో ఈ క్యాంటీన్లు ప్రజలకు సేవలందిస్తున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటివరకు 250 ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు విజయవంతంగా కానసాగుతున్నాయని తెలిపారు.

పార్టీ స్థాపించే అంశం కవిత వ్యక్తిగతం

- కవిత ఆరోపణలపై చర్యలు తీసుకోని సీఎం
- బీజేపీ చీఫ్ రాంచందర్ రావు



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 5: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పార్టీ స్థాపించే అంశం ఆమె వ్యక్తిగతమని టీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు మాట్లాడుతూ.. రాజకీయ పార్టీ పెట్టే స్వేచ్ఛ అందరికీ ఉంటుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్, హరీష్‌రావు, కేటీఆర్‌పై కవిత ఆరోపణల ఆధారంగా ఎందుకు చర్యలు తీసుకోవట్లేదంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఆయన సూటిగా ప్రశ్నించారు.అందుకు సంబంధించిన ఆధారాలు ఇవ్వడానికి కవిత సిద్ధంగా ఉన్నా.. చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య అంతర్గత ఒప్పందం కుదిరిందని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్‌ను కాపాడుతోంది.. సీఎం రేవంత్‌రెడ్డేనని బీజేపీ చీఫ్ రాంచందర్ రావు ఆరోపించారు. బీఆర్ఎస్, బీజేపీలు రెండు ఒక్కటే అనడం ఎమ్మెల్సీ కవిత అవగాహనా లోపమని తెలిపారు.

కేంద్ర చట్టాలకు అనుగుణంగా రాష్ట్ర జీఎస్టీ సవరణ బిల్లు

- శాసనసభలో ప్రవేశపెట్టిన మంత్రి జూపల్లి
- మద్యం తయారీలో ఉపయోగించే ఈఎన్ఏ పై జీఎస్టీ మినహాయింపు
- బిల్లును వ్యతిరేకిస్తూ బీజేపీ సభ్యులు వాకౌట్



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 5: రాష్ట్రంలో వస్తు సేవల పన్ను నిబంధనలను మరింత సరళతరం చేస్తూ, కేంద్ర ప్రభుత్వ మార్గ దర్శకాలకు అనుగుణంగా రూపొందించిన 'తెలంగాణ వస్తు,సేవల పన్ను (సవరణ) బిల్లు2026'ను ప్రభుత్వం సోమవారం శాసనసభలో ప్రవేశపెట్టింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరపున పర్యాటక, సాంస్కృతిక, అబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ బిల్లును సభ ముందు ఉంచారు. గత ఏడాది నవంబరులో జారీ చేసిన ఆర్డినెన్స్ స్థానంలో ఈ నూతన బిల్లును తీసుకొచ్చినట్లు మంత్రి వివరించారు. జాతీయ విధానానికి అనుగుణంగా జీఎస్టీ కౌన్సిల్ 51 నుంచి 55వ సమావేశాల వరకు చేసిన సిఫార్సుల మేరకు దేశవ్యాప్తంగా ఒకే రకమైన పన్ను విధానం ఉండాలనే ఉద్దేశంతో ఈ సవరణలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే తన పరిధిలోని ఐజీఎస్టీ , సీజీఎస్టీ చట్టాలను సవరించిందని, దానికి అనుగుణంగా రాష్ట్ర జీఎస్టీ చట్టంలో మార్పులు చేయడం తప్పనిసరి అయిందని పేర్కొన్నారు. 2025 సెప్టెంబరు నాటికే ఈ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉన్నందున, అప్పట్లో అత్యవసరంగా ఆర్డినెన్స్ జారీ చేశామని, ఇప్పుడు దానికి సభ ఆమోదం కోరుతున్నామని చెప్పారు.

బిల్లులోని కీలక మార్పులు ఇవే

సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూ.. మానవ వినియోగం కోసం తయారు చేసే మద్యం (లిక్కర్)లో వాడే 'ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్' ను జీఎస్టీ పరిధి నుంచి మినహాయించారు. దీని కోసం సెక్షన్ 9ను సవరించారు.పన్ను ఎగవేత కేసుల విచారణలో మరింత పారదర్శకత కోసం సెక్షన్ 74Aను చేర్చారు. దీనివల్ల సాధారణ తప్పులుగా నమోదైన కేసులను విచారణాధారంగా 'మోసం' కిందకు, అలాగే మోసం కింద ఉన్న కేసులను సాధారణ తప్పుల కిందకు మార్చే వెసులుబాటు కలుగుతుంది. గతంలో ఉన్న 'ప్లాంట్ లేదా మెషినరీ' అనే పదాన్ని ఇకపై 'ప్లాంట్ మరియు మెషినరీ'గా మార్చారు. సఫారీ రిట్రీట్స్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు వల్ల తలెత్తిన సాంకేతిక ఇబ్బందులను తొలగించేందుకు ఈ మార్పు చేశారు. పాన్ మసాలా, పొగాకు ఉత్పత్తుల తయారీదారులు పన్ను ఎగవేతకు పాల్పడకుండా ప్రత్యేక రిజిస్ట్రేషన్, నిబంధనలను ప్రవేశపెట్టారు. ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ పంపిణీలో స్పష్టతనిస్తూనే.. మున్సిపల్ ఫండ్, లోకల్ ఫండ్ వంటి నిర్వచనాలను సవరించారు. దీనివల్ల స్థానిక సంస్థలకు సంబంధించిన పన్ను వ్యవహారాల్లో గందరగోళం తొలగిపోనుంది. జీఎస్టీ అప్పిలేట్ ట్రిబ్యునళ్ల ఏర్పాటు, ఈకామర్స్ కార్యకలాపాలు, వోచర్ల పైన పన్ను విధింపు వంటి అంశాల్లోనూ ఈ బిల్లు ద్వారా స్పష్టత చేకూరనుందని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. జీఎస్టీ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ బీజేపీ సభ్యులు వాకౌట్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన చట్టాలకు అనుగుణంగా మార్పులంటూ కీలక నిర్ణయం తీసుకోవడం సహించరానిదని రన్నారు.



ప్రజల ప్రాణాలకు, పర్యావరణానికి ముప్పుగా మారిన చైనీస్ మాంజాపై కఠినంగా వ్యవహరిస్తాం. మాంజాను విక్రయించినా, నిల్వ ఉంచినా చట్టపరమైన చర్యలు తప్పవు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. ఎక్కడైనా విక్రయాలు కనిపిస్తే వెంటనే డయల్100కు ఫోన్‌చేయాలని, లేదా 9490616555 నంబర్‌కు వాట్సాప్ ద్వారా సమాచారం ఇవ్వాలి.

- పోలీస్ కమిషనర్ సజ్జనార్



తెలుగు రాష్ట్రాల మధ్య సమైక్యత అవసరం

- త్వరలో పోలవరం పూర్తవుతుంది
- తెలంగాణ సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలు అసంబద్ధం
- ఏపీ సీఎం చంద్రబాబు



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 5: తెలుగువాళ్లు కలిసుంటే ఎన్నో సమస్యలు పరిష్కరించుకోవచ్చని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. సోమవారం గుంటూరులో జరుగుతున్న తెలుగు సభల్లో గోదావరి జలాల గురించి ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల మధ్య విద్వేషాలు కాదు, సమైఖ్యత అవసరం అని అన్నారు. తెలుగువారంతా కలిసి ఉండాలని బాబు వివరించారు. రెండు తెలుగు రాష్ట్రాలు ఒకరినొకరు అర్థం చేసుకుని కలిసి ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని సీఎం చంద్రబాబు వివరించారు. ఎంతోమంది త్యాగాలు చేశారని, ఇది రాజకీయ వేదిక కాదని నీటి విషయంలో, సహకారంలో తెలుగువారంతా కలిసి ఉండాలని చంద్రబాబు అన్నారు. ప్రపంచంలో ఎక్కడ ఉన్నా మనల్ని గుర్తించే ఏకైక భాష తెలుగు భాష అని సీఎం కొనియాడారు. ఎన్టీఆర్ హయాంలో ఉమ్మడి ఏపీలో పలు ప్రాజెక్టులు కట్టినట్లు వివరించారు. నా హయాంలో తెలంగాణలో కల్వకుర్తి, ఏఎంఆర్, నెట్టెంపాడు పూర్తి చేశామని చంద్రబాబు గుర్తు చేశారు. భీమా ఎత్తిపోతల కూడా తన హయాంలోనే పూర్తయిందని అన్నారు.

గోదావరిపై ఎన్ని ప్రాజెక్టులు కట్టినా ఫర్వాలేదు...

వర్షాకాలంలో గోదావరి నది ఉప్పొంగి పారుతూ వేల టీఎంసీల నీళ్లు సముద్రంలో కలుస్తున్నాయన్నారు. గోదావరిపైనా ఉమ్మడి ఏపీలో అనేక ప్రాజెక్టులు కట్టామని, గతేడాది కృష్ణా, గోదావరి నుంచి 6 వేల టీఎంసీలు సముద్రంలోకి వెళ్లాయన్నారు. గోదావరి నీళ్లు వాడుకుంటే నేను ఎప్పుడూ అడ్డుచెప్పలేదన్నారు. విభజన తర్వాత కాళేశ్వరం కట్టినా గోదావరిలో చాలా నీళ్లున్నాయని అభ్యంతరం చెప్పలేదని సీఎం చంద్రబాబు తెలిపారు. గోదావరిపై ఎన్ని ప్రాజెక్టులు కట్టినా ఫర్వాలేదని, రాష్ట్రానికి నీళ్లు వస్తాయని అనుకున్నానని సీఎం తెలిపారు. గడచిన 40 ఏళ్లుగా 3 వేల టీఎంసీలు గోదావరి నుంచి సముద్రంలోకి పోతున్నాయన్నారు

త్వరలో పోలవరం ప్రాజెక్టు పూర్తి..

కృష్ణాగోదావరి నదుల అనుసంధానం జరుగుతుందని చంద్రబాబునాయుడు తెలిపారు. ప్రపంచంలో తక్కువ నీటి వినియోగం చేసే దేశం మన భారతదేశమే అని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్నా గంగా, కావేరి కలవాలన్నారు. దేశంలో నీటి సమస్య పరిష్కారం కావాలి. ఏపీలో ఉండే నదులన్నీ అనుసంధానం కావాలి. తెలంగాణలో గోదావరి నీళ్లు కూడా వాడుకోవాల్సిన అవసరం ఉంటే వాడుకోవాలని సూచించారు. మరోవైపు రాష్ట్రంలోని సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణ పనుల విషయం ముఖ్యమంత్రి చంద్రబాబు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్న విషయం విదితమే. ఈ క్రమంలోనే ఈ నెల 7న పోలవరం పర్యటనకు వెళ్లనున్నారు. ప్రాజెక్టు సందర్శన తో పాటు నిర్మాణ పనుల పురోగతి పైనా క్షేత్రస్థాయిలో సీఎం సమీక్షిస్తారు. అదే రోజు సాయంత్రం విజయవాడలో సిద్ధార్థ అకాడమీ గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో సీఎం పాల్గొంటారు.

తెలంగాణ సీఎం వ్యాఖ్యలు అసంబద్ధం...

ఇదిలా ఉండగా మరోవైపు ఇటీవల తెలంగాణ ప్రయోజనాల కోసం కూటమి ప్రభుత్వం రాయలసీమ లిఫ్ట్ పనులు నిలిపివేసిందన్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను ఆంధ్రప్రదేశ్ సర్కార్ తప్పుబట్టింది. తన విన్నపం మేరకు, తనపై గౌరవంతో చంద్రబాబు రాయలసీమ లిఫ్ట్ నిలిపివేశారని తెలంగాణ సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలు అసంబద్ధం అని తెలిపిన సంగతి తెలిసిందే. జగన్ హయాంలో ఎటువంటి అనుమతులు లేకుండా నాటి ప్రభుత్వం రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టును చేపట్టిందని వెల్లడించింది. సీమకు రోజుకు 3 టీఎంసీల నీరు అంటూ భారీ ప్రకటనలతో అనుమతులు లేకుండా జగన్ పనులు చేపట్టారని, నాటి సీఎం జగన్ ప్రచారంతో రాయలసీమ లిఫ్ట్ పై తెలంగాణ ప్రభుత్వం కోర్టులో కేసులు వేసిన విషయాన్ని గుర్తు చేసింది.



కరెన్సీ పై గాంధీ బొమ్మను తొలగించే కుట్రలను తిప్పి కొట్టాలి

- ఆదివాసీ కార్యకర్త సమ్మేళనం ముగింపు సభలో టిజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

ప్రతిపక్షం సంగారెడ్డి, ప్రతినిధి, జనవరి5: నేషనల్ ఆదివాసీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంగారెడ్డి లో మూడు రోజుల పాటు జరిగిన ఉమ్మడి మెదక్ జిల్లా ఆదివాసి కార్యకర్తల, నాయకుల శిక్షణ శిబిరం సోమవారం తో ముగిసింది. ఈ శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ సురేష్ శెట్కార్, టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మన్, నేషనల్ ఆదివాసీ కాంగ్రెస్ వైస్ చైర్మన్ బెల్లయ్య నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణా శిబిరం లో పాల్గొన్న కార్యకర్తలకు ముఖ్య అధితుల చేతుల మీదుగా వారికి ప్రశంస పత్రాలు అందజేశారు. .ఆదివాసీల హక్కులు, సంక్షేమ పథకాలపై అవగాహన ప్రధాన ఎజెండా గా జరిగిన ఈ శిక్షణా కార్యక్రమానికి ఉమ్మడి మెదక్జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ఆదివాసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ శిక్షణా కార్యక్రమం లో ప్రతీ ఒక్కరూ సిన్సియర్ గా చాలా ఇష్టంగా పాల్గొన్నారన్నారు.ఇలాంటి క్యాంపు సంగారెడ్డి లో జరగడం సంతోషంగా ఉందని తెలిపారు. నారాయణఖేడ్ ప్రాంత ప్రజల కోరిక మేరకు ఆ ప్రాంతంలో ఇండస్ట్రియల్ ఏర్పాటు చేసి స్థానికులకు ఉద్యోగ అవకాశం కలిపిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ కన్న తల్లి లాంటి దన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేయని వారు గాంధీ బొమ్మ ను తొలిగించాలని కుట్ర చేస్తున్నారని అందరం ఏకం అయ్యి అలాంటి కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఇతర పార్టీలు మాటలతో సరిపెట్టుకుంటారు. ..కానీ కాంగ్రెస్ పార్టీ ఆలా కాదు... ఇచ్చిన మాటను నిలబెట్టుకొని తీరుతుందని వివరించారు. అదివాసీ శిక్షణలో జరిగిన చర్చలు, విషయాలను బయట చెర్చించా లని కోరారు. అనంతరం ఎంపీ సురేష్ శెట్కార్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం నుండి గాంధీ పేరు ను తీసేసి కేంద్ర ప్రభుత్వం తప్పు చేసిందన్నారు. కేంద్రం చర్యలకు వ్యతిరేకం గా పార్లమెంట్ లో పోరాటం చేస్తామన్నారు. గరిబోళ్ల కు ఉపాధి కల్పించకుండా, గరిబోళ్లను పెంచే విదంగా కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని నిర్మలా జగ్గారెడ్డి ఆరోపించారు..

వాళ్లు మోసం చేశారు.. మనం న్యాయం చేద్దాం

- ఉద్యమకారులు, జర్నలిస్టులకు ప్లాట్లు ఇవ్వండి
- అసెంబ్లీలో స్పీకర్ ద్వారా ప్రభుత్వాన్ని కోరిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- మండలాలు, పంచాయతీలకు భవనాలు కోరిన ఎమ్మెల్యే



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 5: ఉద్యమకారులు, జర్నలిస్టుల సహకారంతో అధికారంలోకి వచ్చి పదేళ్లపాటు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం వారిని తీవ్రంగా మోసం చేసింది.. కనీసం మనమైనా న్యాయం చేద్దాం.. ఉద్యమకారులకు, జర్నలిస్టులకు వెంటనే ప్లాట్లు ఇచ్చేలా చర్యలు తీసుకోండి.. అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పీకర్ ప్రసాద్ రావు ద్వారా ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ ఫరూక్ నగర్ మండలంలోని కంసాన్ పల్లిలో ఘణికృత పశు ఉత్పత్తి కేంద్రం గత ప్రభుత్వ హయాంలో 50 ఎకరాలలో ప్రారంభించారని, కానీ అర్ధాంతరంగా వదిలేసారని ఆరోపించారు. దానిని వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని, దాని వల్ల రైతులకు ఎంతో ఉపయోగం ఉంటుందని వెల్లడించారు. అదేవిధంగా నియోజకవర్గంలో కొత్త మండలాలు, కొత్త పంచాయతీలు ఏర్పాటు చేసినప్పటికీ ఎక్కడ కూడా సొంత భవనాల నిర్మాణం లేక పరిస్థితి అస్తవ్యస్తంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే నూతన భవనాలు మంజూరు చేయాలని కోరారు. ఇక గ్రామీణ ప్రాంతాలలో రేషన్ కార్డులు చాలా మందికి ఇవ్వాల్సి ఉందని, అలాగే డీలర్ల కొరత కూడా ఉందని దృష్టికి తెచ్చారు. ఈ రెండు సమస్యలు తీర్చాలని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డిని ఆయన కోరారు.





పేదలకు వైద్య సేవలకు ప్రాముఖ్యత

- మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్

ప్రతిపక్షం,సికింద్రాబాద్, జనవరి 5: నిరుపేదలకు వైద్య సేవలకు అధిక ప్రాముఖ్యతను కల్పిస్తామని, విద్య, వైద్య రంగాలను పేదలకు చేరువలో నిలుపుతామని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన 20 మంది లబ్దిదారులకు సుమారు 9 లక్షల విలువజేసే ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను సితఫలమండీ లోనే ఎం.ఎల్.ఏ. క్యాంపు కార్యాలయంలో పద్మారావు గౌడ్ సోమవారం కార్పొరేటర్లు, అధికారులు, నేతలతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలకు వైద్య సేవలను అందించడంలో తాము అగ్ర స్థానంలో నిలుస్తామని అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన ప్రజల సమస్యల పరిష్కారానికి సితఫలమండీ లోని తమ క్యాంపు కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను పొందేందుకు దళారీలను ఆశ్రయిన్చారాదని, ఎవరికీ డబ్బులు చెల్లించరాదని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కంది శైలజ, సామల హేమ, రాసురి సునీత తదితరులు పాల్గొన్నారు.



అబద్ధాల పునాదులపై కాంగ్రెస్ ప్రభుత్వం

- బీఆర్ఎస్ విప్ కేపీ వివేకానంద

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 5: కాంగ్రెస్ పార్టీ అబద్ధాల పునాదులపై ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ప్రజలను మోసం చేస్తోందని బీఆర్ ఎస్ అసెంబ్లీ విప్ కేపీ వివేకానంద తీవ్ర విమర్శలు చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్ లో సోమవారం ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభలో ఆన్‌రికార్డ్‌గా పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని ఆరోపించారు.రేవంత్ రెడ్డి మాటలను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని, దేవుళ్ల మీద ఒట్టు వేసి కూడా ప్రజలను మభ్యపెట్టారని అన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై చర్చ సందర్భంగా దేవుడిపై ఆన అని చెప్పిన ముఖ్యమంత్రి ఇప్పుడు మాట తప్పుతున్నారని విమర్శించారు. ప్రజల్లో రేవంత్ రెడ్డి విశ్వాసం పూర్తిగా కోల్పోయారని పేర్కొన్నారు. అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కూడా తప్పుదోవ పట్టించే సమాచారం ఇచ్చారని, రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను తానే ఆపానని ముఖ్యమంత్రి చెప్పడం అవాస్తవమని అన్నారు. ఆ ప్రాజెక్టును ఎవరు ఆపారన్న విషయాన్ని హరీష్ రావు ఇప్పటికే స్పష్టంగా వివరించారని తెలిపారు. అపెక్స్ కౌన్సిల్‌లో ఉన్న అంశాలను కూడా రేవంత్ రెడ్డి వక్రీకరించారని, కృష్ణా నదీ జలాలపై శాశ్వత ఒప్పందం ఉన్నట్లుగా ప్రజలను, సభను నమ్మించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి మీద ప్రివిలేజ్ మోషన్ ఇచ్చామని, దానిని స్పీకర్ అంగీకరించాలని డిమాండ్ చేశారు.అసెంబ్లీలో బీఆర్ఎస్‌కు మాట్లాడే హక్కులు కోల్పోలేదని, మైక్ ఇవ్వడానికి కాంగ్రెస్ ప్రభుత్వం భయపడుతోందని వ్యాఖ్యానించారు. తెలంగాణ అసెంబ్లీ కౌరవ సభలా మారిందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. జీరో అవర్‌ను నాలుగు గంటలు నడిపారని, ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. బీఆర్ ఎస్ పార్టీపై బురద చల్లడం ప్రభుత్వ అజెండాగా మారిందని, తెలంగాణ హక్కులను కాంగ్రెస్ కాలరాస్తోందని కేపీ వివేకానంద ఆరోపించారు. ముఖ్యమంత్రి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

చెత్తకుప్పలో పసికందు

- రంగారెడ్డి జిల్లాలో అమానుష ఘటన..

ప్రతిపక్షం, రంగారెడ్డి, జనవరి 5: తొమ్మిది నెలలు మోసి కన్న బిడ్డపై తల్లికి మమకారం ఎక్కువే. అప్పటి వరకు పడిన బాధను.. పుట్టిన బిడ్డను చూసి మరిచిపోతుంది. కన్న బిడ్డను కంటికి రెప్పలా కాపాడుకుంటుంది తల్లి. కానీ.. ఇటీవల అప్పుడే పుట్టిన పసికందులను నిర్ధాక్షణ్యంగా రోడ్డుపై వదిలేసిన ఘటనలు ఎన్నో చూస్తున్నాం. అక్రమ సంబంధం, పెళ్లి కాకుండానే తల్లయిన కొందరు.. మాతృత్వాన్ని మంట గలుపుతున్నారు. పుట్టిన వెంటనే తల్లి పొత్తిళ్లలో హాయిగా ఉండాల్సిన పసికందులను చెత్తకుప్పల్లో, రహదారులపై పడేస్తుండటం పలువురిని కలచివేస్తోంది. రంగారెడ్డి జిల్లాలోనూ ఇలాంటి అమానుష ఘటనే చోటు చేసుకుంది. వివరాల్లోకెళితే...మైలార్‌దేవ్ పల్లి డివిజన్ పరిధిలో బాబుల్ రెడ్డి నగర్‌లో దారుణ ఘటన జరిగింది. అప్పుడే పుట్టిన ఓ పసికందును కొందరు గుర్తుతెలియని వ్యక్తులు రోడ్డు పక్కన చెత్త కుప్ప వద్ద పడేసి వెళ్లిపోయారు. చెత్త కుప్పల్లో పడేయడంతో పాప తీవ్ర అస్వస్థకు గురై అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని మృత శిశువును స్వాధీనం చేసుకున్నారు. ఆ ప్రాంతంలో సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆ పసికందును ఎక్కడి నుంచి తీసుకువచ్చారు? ఆడపిల్ల పుట్టిందని ఇలా చేశారా? లేక మరే ఇతర కారణాలున్నాయా అని విచారణ కొనసాగిస్తున్నారు.

కనకమామిడి వెంకన్న ఆలయంలో చోరీ

- నగదు, అభరణాలు అపహరణ



ప్రతిపక్షం, మొయినాబాద్, జనవరి 5 : మొయినాబాద్ మండలంలోని కనకమామిడి వెంకన్న ఆలయంలో సోమవారం ఉదయం చోరీ జరిగింది. ఆలయ తాళాలు పగులగొట్టి హుండీలోని నగదును , అభరణాలు అపహరించారు. భక్తులు ఉదయం ఆలయానికి వచ్చినప్పుడు ఈ ఘటనను గుర్తించి, నిర్వాహకులకు సమాచారం అందించారు. శ్రీదేవి, భూదేవి బంగారు ఆభరణాల మొత్తం విలువ రూ.6లక్షల95వేలు ఉంటుందని తెలిపారు. అదేవిధంగా హుండీని పగులగొట్టి రూ.1లక్ష 15వేల నగదును ఆపరించినట్లు తెలిపారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు సంఘటన స్థలానికి చేరుకుని సీసీ కెమెరాలను పరిశీలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మైనార్జీ యోజనకు దరఖాస్తుల ఆహ్వానం



ప్రతిపక్షం, మొయినాబాద్, జనవరి 5 : ప్రభుత్వం మైనార్జీల సంక్షేమం కోసం తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఇందిరమ్మ మైనార్టీ మహిళా యోజన, రేవంత్ అన్నా కా సహారా మెస్కినో కే.లియే, పథకాలల క్రింద ఆన్‌లైన్లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారిణి సంధ్యారాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఈ నెల 10వ తేది వరకు ఆన్ లైన్ లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇందిరమ్మ మైనార్టీ మహిళా యోజన ద్వారా వితంతువులు, విడాకులు పొందినవారు, అనాధలు, అవివాహిత మహిళలకు చిన్న వ్యాపారాలకు ఒక్కొక్కరికి రూ.50వేల ఆర్థికసాయం లభిస్తుందని తెలిపారు.రేవంతన్నా కా సహారా మిస్కీనో కె.లియే పథకానికి ఫఖీర్ ,దుదేకుల వర్గాలకు చెందిన అర్హులకు మోపెడ్ వాహనాలు మంజూరు చేస్తారని తెలిపారు. అర్హులైనా వారు ఈ పథకాలకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

జీహెచ్ఎంసీ విభాగాల పనితీరుపై అవగాహన పెంపొందించుకోవాలి

- కమిషనర్ ఆర్.వి. కర్ణన్



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 05: జీహెచ్ఎంసీ పరిధిలోని వివిధ విభాగాల పనితీరు, వాటి బాధ్యతలపై నూతనంగా బాధ్యతలు చేపట్టిన అదనపు కమిషనర్లు, జోనల్ కమిషనర్లు సమగ్ర అవగాహన కలిగి ఉండాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ సూచించారు. ఇటీవల జీహెచ్ఎంసీని 6 జోన్ల నుంచి 12 జోన్లకు, 30 సర్కిళ్ల నుంచి 60 సర్కిళ్లుగా పునర్వ్యవస్థీకరించిన నేపథ్యంలో, నూతనంగా బాధ్యతలు చేపట్టిన అధికారులకు అవగాహన కల్పించే ఉద్దేశంతో జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్‌లో జీహెచ్ఎంసీ విభాగాల పనితీరుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, హెల్త్ అండ్ సానిటేషన్, రెవెన్యూ అండ్ ప్లానింగ్, అడ్మినిస్ట్రేషన్ అండ్ సపోర్ట్, అర్బన్ సర్వీసెస్ అండ్ డెవలప్‌మెంట్ విభాగాలకు చెందిన అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ల ద్వారా ఆయా విభాగాల విధులు, బాధ్యతలు, పనితీరు అంశాలను అదనపు కమిషనర్లు, జోనల్ కమిషనర్లకు వివరించారు.ఈ సందర్భంగా అధికారులు అడిగిన సందేహాలకు సంబంధిత విభాగాధికారులు సమాధానాలు ఇచ్చారు. అనంతరం కమిషనర్ ఆర్.వి. కర్ణన్ మాట్లాడుతూ...విభాగాల పనితీరు పై రూపొందించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు నూతన అధికారులు తమ బాధ్యతలను స్పష్టతతో, సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ నెల 6వ తేదీన ఇంజనీరింగ్ ప్రాజెక్టులు, 7వ తేదీన సానిటేషన్, 8వ తేదీన టౌన్ ప్లానింగ్, 9వ తేదీన మెయింటెనెన్స్ అంశాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.జోన్ల వారిగా జీహెచ్ఎంసీ వివిధ విభాగాల పనితీరు, వాటి కోర్ విధులపై సమగ్రంగా వివరించేలా పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు సిద్ధం చేయాలని కమిషనర్ విభాగాల ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ అవగాహన కార్యక్రమాలను అధికారులు సద్వినియోగం చేసుకొని జీహెచ్ఎంసీ పనితీరుపై సమగ్ర అవగాహన పొందడంతో పాటు తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని ఆయన సూచించారు.సమావేశంలో అదనపు కమిషనర్లు సృజన ,వినయ్ కృష్ణారెడ్డి, హేమంత్ కేశవ్ పాటిల్ , రఘు ప్రసాద్, పంకజ, మంగ తాయారు, సత్యనారాయణ, జోనల్ కమిషనర్లు జి. ముకుందరెడ్డి, అపూర్వ చౌహాన్, కె. చంద్రకళ, రాధికా గుప్తా, రవి కిరణ్, ప్రియాంక అలా, సంచిత్ గంగ్వార్, హేమంత్ బోర్కడే, సహదేవ్ రావు, చీఫ్ ఇంజనీర్లు సహదేవ్ రత్నాకర్, జ్యోతి తదితర విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



సర్పంచ్, వార్డు సభ్యులకు సన్మానం

ప్రతిపక్షం,మొయినాబాద్,జనవరి 5 : మండల పరిధిలోని అమ్దాపూర్ గ్రామ పంచాయతీ పాలకవర్గాన్ని సోమవారం జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులు శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రేణుకాదేవి, సత్యనారాయణలు మాట్లాడుతూ... గ్రామంతో పాటు పాఠశాలను అన్ని విధాలుగా అబివృద్ధిచేయాలని కోరారు. గ్రామాభివృద్ధిలో మీతో పాటు మేము సైతం భాగస్వాములవుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మద్యపాగ కృష్ణ, ఉపసర్పంచ్ జితేందర్ రెడ్డి,వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్ల విషయంలో కటాఫ్ మార్కులు సాధించే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈబీసీ అభ్యర్థులు ఓసీ పోస్టులకు అర్హులే. ఇంటర్వ్యూలో ఆ అభ్యర్థులు ఇతరులకన్నా మెరిట్లో ఉంటే వారిని ఓపెన్ పోస్టుల్లోనే నియమించాలి. దీనిపై దాఖలైన పిటిషన్‌ను కొట్టేస్తున్నాం.

\- సుప్రీంకోర్టు

కరిగిపోతున్న డాలర్ డ్రీమ్స్

అగ్రరాజ్యం అమెరికా విదేశీ ఉద్యోగులను తగ్గిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా అమెరికా వెళ్లాలని భావిస్తున్న ప్రయాణికులకు దిమ్మతిరిగే షాక్ ఇచ్చేలా టూరిస్ట్ వీసా ఫీజులను యూఎస్ భారీగా పెంచింది అన్న వార్తలు ఇప్పుడు హల్చల్ చేస్తున్నాయి. ఈ నిర్ణయంతో ముఖ్యంగా భారతీయులు, విద్యార్థులు, పర్యాటకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడు అయ్యాక విదేశీ ఉద్యోగులపై కక్ష గట్టాడు. ముఖ్యంగా భారతీయులను వెళ్లగొట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. నూతన సంవత్సరాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ మార్పులు అమల్లోకి తీసుకువచ్చినట్లు చెప్తున్నారు. దీని ప్రకారం ఇప్పటివరకు 17 వేల రూపాయలు వీసా ఫీజుగా చెల్లిస్తే, ఇకపై 40వేల రూపాయలు వీసా ఫీజుగా చెల్లించాలి. కానీ ఇందులో కొంత ఉపశమనం ఇచ్చే వార్త కూడా యూఎస్ ప్రభుత్వం చెప్పింది, ఎవరైతే యూఎస్ వెళ్లి తిరిగి చెప్పిన సమయంలోనే తిరిగి వస్తారో వారికి వీసా ఇంటిగ్రిటీ ఫీజుగా వసూలు చేసే 250 డాలర్లు తిరిగి ఇస్తారని చెప్తున్నారు. అయితే యూఎస్ తాజా నిర్ణయం అయిన వీసా ఫీజుల పెంపుతో విదేశీ ప్రయాణ ఖర్చులు మరింత పెరిగే అవకాశముంది. ఇప్పటికే విమాన టికెట్లు, హోటల్ ఖర్చులు పెరిగిన నేపథ్యంలో తాజా నిర్ణయం ప్రయాణికులపై అదనపు ఆర్థిక భారం పడుతుంది. ముఖ్యంగా అమెరికాకు టూరిజం, బిజినెస్, కుటుంబ సభ్యుల సందర్శన కోసం వెళ్లే వారికి ఈ నిర్ణయం ఇబ్బందికరంగా మారింది. డాలర్ డ్రీమ్స్! అమెరికాలో ప్రస్తుతం ఉత్పన్నం అవుతున్న పరిస్థితులు.. భారతీయ మిడిల్ క్లాస్ ను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ విషయం అందరూ పదేపదే చర్చించుకుంటున్నారు. అయితే.. ఎందుకు ఆందోళన చెందాలి? అనేది ముందుగా మనం ఆలోచించాలి. అమెరికాలో ఉద్యోగాలు ఇక తగ్గిపోతాయనే భయం, అమెరికాకు చేసే ఎగుమతులు మందగిస్తాయనే భయం.. మిగిలిన యావత్ ప్రపంచాన్ని కూడా ఆందోళనకు గురిచేస్తుండవచ్చు. కానీ కొంచెం లోతుగా, భిన్నంగా ఆలోచిస్తే ఇవన్నీ కూడా అర్థం లేని భయాలే అనిపిస్తుంది. అధిక సంపాదన, అధిక లాభాలు.. ఇలా 'అధిక' అనే పదాన్ని పట్టించుకోకపోతే గనుక.. ఇక ఎవ్వరికీ ఏ చింతా లేదు. నిజానికి ఈ భయాలు మనం పరాధీనులుగా మారిపోతున్నామా అనే అనుమానాన్ని మనకు కలిగిస్తున్నాయి. అమెరికా చదువుల కోసం వెళుతున్న వారిని కదలిస్తే.. అక్కడి డాలర్ల సంపాదన గురించి.. ఇక్కడకు అక్కడకు సంపాదనలో ఉండే తేడా గురించిన ఆశ కనిపిస్తున్నదే తప్ప.. అక్కడి చదువులు తమను ఎంత పదును పెడుతున్నాయనే చర్చ ఎప్పటికీ ఉండదు. అమెరికాలో చదువుకోవడానికి వెళుతున్న విద్యార్థులు కూడా అన్ని రకాల నిబంధనలను అతిక్రమించి.. చిరుద్యోగాలు, కూలిపనులు చేసుకుంటూ డాలర్లు సంపాదించడానికి వెళ్లిన తొలి రోజునుంచి దృష్టి పెడుతుండడాన్ని కూడా మనం గమనినంచాలి. ట్రంప్ సుంకాలు విధించినప్పటినుంచి భారత్ నుంచి ప్రధానంగా ఫార్మా, ఆక్వా తదితర రంగాలు ప్రభావితం అవుతాయని అంతా అంచనా వేస్తూ వచ్చారు. ఈ రంగాలు దెబ్బతింటాయని, ఎగుమతులు తగ్గుతాయని, ఆ పరిశ్రమల మీద ఆధారపడిన వేలమంది జీవితాలు గందరగోళంలో పడతాయని రకరకాల వ్యాఖ్యానాలు వినిపిస్తూ వస్తున్నాయి. అయితే ఈ రంగాలతో సంబంధం లేని, అమెరికా పరిణామాలతో సంబంధంలేని సగటు భారతీయుల వాదన మరో రకంగా వినిపిస్తూ ఉంటుంది. అక్కడ ఎమ్మెస్ డిగ్రీ చేయడం అనేది.. అక్కడ ఉద్యోగం దొరకబుచ్చుకోవడం కోసం ఒక సాకు మాత్రమే. ప్రధాన లక్ష్యం.. సంపాదనే. ఆ క్లారిటీ అందరికీ ఉన్నది గనుకనే.. తొలినాటినుంచి సంపాదన మీద దృష్టిపెడుతూ వస్తున్నారు. ఈ క్రమంలో హెచ్-1బీ వీసా నిబంధనలు కఠినతరం చేశారు. వీసా ఫీజు రూ.లక్ష డాలర్లకు పెంచారు. తాజాగా వీసా కేటాయింపు ప్రక్రియలో ర్యాండమ్ లాటరీ వ్యవస్థను మార్చి, వేతనం, నైపుణ్యాల ఆధారంగా జారీ చేయాలని నిర్ణయించారు. ఈ మార్పులు ఫెడరల్ రిజిస్టర్‌లో ప్రచురితమయ్యాయి. 2027 ఆర్థిక సంవత్సరం క్యాప్ రిజిస్ట్రేషన్ నుంచి అమలవుతాయి. ఇకపై అధిక వేతనాలు పొందే నిపుణులకు ఎంపిక అవకాశాలు గణనీయంగా పెరుగుతాయిఅమెరికా కార్మిక శాఖ, హెచ్-1బీ ఉద్యోగుల వేతనాలను నాలుగు లెవల్స్‌గా వర్గీకరించింది. ఎంట్రీ-లెవల్ వర్కర్లు - ర్యాండమ్ లాటరీలో ఒక్కసారి మాత్రమే పాల్గొంటారు (ఛాన్స్ 15% తగ్గుతుంది)మధ్యస్థ నైపుణ్యం - రెండుసార్లు ఎంపిక అవకాశం (31% ఛాన్స్).అధిక నైపుణ్యం - మూడుసార్లు ప్రవేశం (46% అవకాశం).అత్యధిక వేతనం - నలుసార్లు లాటరీలో పాల్గొనవచ్చు (61% ఎంపిక ఛాన్స్). హెచ్-1బీ/హెచ్-4 అపాయింట్ మెంట్ ఆలస్యాలతో భారతీయ వలసదారులు ఇబ్బంది పడుతున్నారు. చట్ట ఉల్లంఘనలకు క్రిమినల్ కేసులు, జరిమానాలు విధిస్తామని హెచ్చరించింది. ట్రంప్ పరిపాలన అక్రమ వలసలను అరికట్టి, సరిహద్దులు, పౌరుల భద్రతకు కట్టుబడి ఉందని స్పష్టం చేసింది.

ప్రతిపక్షం

హైదరాబాద్,

మంగళవారం
06.01.2026

వెనెజువెలా మంటలు భారత్ దాకా వస్తాయా?

వెనెజువెలాలో నెలకొన్న అస్థిరత భారత్‌కు ఆర్థికంగా ఎంతో కీలకమైన అంశం. ప్రపంచంలోనే అతిపెద్ద ముడిచమురు నిల్వలు ఉన్న దేశాలలో వెనెజువెలా ఒకటి కావడంతో, అక్కడ జరిగే ఏ చిన్న అలజడి అయినా అంతర్జాతీయ చమురు మార్కెట్‌పై తక్షణ ప్రభావం చూపుతుంది. గత దశాబ్ద కాలంగా భారత్ తన ఇంధన అవసరాల కోసం వెనెజువెలాపై గణనీయంగా ఆధారపడుతూ వచ్చింది. మదురో ప్రభుత్వంపై అమెరికా విధించిన ఆంక్షల కారణంగా ఇటీవల దిగుమతులు తగ్గినప్పటికీ, ఇప్పుడు జరుగుతున్న సైనిక చర్య వల్ల చమురు సరఫరా వ్యవస్థ పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉంది. దీనివల్ల అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు పెరిగితే, అది భారత్ వంటి దిగుమతి ఆధారిత దేశాల ఆర్థిక వ్యవస్థపై తీవ్ర భారాన్ని మోపుతుంది.




వెంక గారి భూమయ్య
9848559863

దక్షిణ అమెరికా ఖండంలో అత్యధిక చమురు నిల్వలు కలిగిన వెనెజువెలాలో మూడు రోజులుగా చోటుచేసుకున్న పరిణామాలు ప్రపంచ భౌగోళిక రాజకీయాలను ఒక్కసారిగా కుదిపేశాయి. అమెరికా దళాలు ఆ దేశ రాజధాని కారకస్‌పై మెరుపు దాడులు నిర్వహించి, అధ్యక్షుడు నికోలస్ మదురోను అదుపులోకి తీసుకోవడం అంతర్జాతీయ చట్టాలు మరియు సార్వభౌమాధికారంపై కొత్త చర్చకు దారితీసింది. ఈ ఉద్రిక్తతలపై భారత విదేశాంగ శాఖ స్పందిస్తూ, అక్కడి పరిస్థితులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొనడం గమనార్హం. మారుతున్న పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నామని చెబుతూనే, సమస్యను శాంతియుత మార్గాల్లో మరియు దౌత్యపరమైన చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని భారత్ పిలుపునిచ్చింది. అయితే, ఈ ఆందోళన కేవలం ఒక దేశ రాజకీయ మార్పు గురించి మాత్రమే కాదు, దీని వెనుక భారత్ యొక్క లోతైన ఆర్థిక మరియు వ్యూహాత్మక ప్రయోజనాలు ముడిపడి ఉన్నాయి. అందుకే కారకస్‌లో రేగిన మంటలు ఢిల్లీ దౌత్య వర్గాల్లో వేడిని పెంచుతున్నాయి. వెనెజువెలాలో నెలకొన్న అస్థిరత భారత్‌కు ఆర్థికంగా ఎంతో కీలకమైన అంశం. ప్రపంచంలోనే అతిపెద్ద ముడిచమురు నిల్వలు ఉన్న దేశాలలో వెనెజువెలా ఒకటి కావడంతో, అక్కడ జరిగే ఏ చిన్న అలజడి అయినా అంతర్జాతీయ చమురు మార్కెట్‌పై తక్షణ ప్రభావం చూపుతుంది. గత దశాబ్ద కాలంగా భారత్ తన ఇంధన అవసరాల కోసం వెనెజువెలాపై గణనీయంగా ఆధారపడుతూ వచ్చింది. మదురో ప్రభుత్వంపై అమెరికా విధించిన ఆంక్షల కారణంగా ఇటీవల దిగుమతులు తగ్గినప్పటికీ, ఇప్పుడు జరుగుతున్న సైనిక చర్య వల్ల చమురు సరఫరా వ్యవస్థ పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉంది. దీనివల్ల అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు పెరిగితే, అది భారత్ వంటి దిగుమతి ఆధారిత దేశాల ఆర్థిక వ్యవస్థపై తీవ్ర భారాన్ని మోపుతుంది. రవాణా ఖర్చులు పెరగడం ద్వారా దేశీయంగా ద్రవ్యోల్బణం పెరిగి, సామాన్య ప్రజలపై భారం పడే అవకాశం ఉంది. అంతేకాకుండా, వెనెజువెలాలో ఓఎన్‌జీసీ విదేశ్ వంటి భారతీయ చమురు సంస్థలు వేల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టాయి. మదురో ప్రభుత్వం పతనం కావడం, ఆ దేశంలో పౌర యుద్ధం వంటి పరిస్థితులు తలెత్తితే, ఆ పెట్టుబడుల భద్రత మరియు సుమారు ఒక బిలియన్ డాలర్లకు పైగా రావాల్సిన బకాయిలు ప్రశ్నార్థకంగా మారుతాయి. అయితే, ఈ సంక్షోభం వెనుక కొన్ని సానుకూల కోణాలు కూడా దాగే ఉన్నాయి. అమెరికా చర్యను భారత్ నేరుగా ఖండించకపోవడానికి ప్రధాన కారణం ప్రజాస్వామ్య పునరుద్ధరణ ఆకాంక్ష మరియు అగ్రరాజ్యంతో ఉన్న వ్యూహాత్మక బంధం. మదురో పాలనలో వెనెజువెలా ఆర్థికంగా కుప్పకూలిపోవడమే కాకుండా, మానవ హక్కుల ఉల్లంఘనలు పెచ్చుమీరాయి. ఇప్పుడు అమెరికా జోక్యంతో అక్కడ ఒక పారదర్శకమైన ప్రభుత్వం ఏర్పడితే అది దీర్ఘకాలంలో భారత్‌కు ఎంతో మేలు చేస్తుంది. అంతర్జాతీయ ఆంక్షలు తొలగిపోతే, భారత్ మళ్లీ చౌక ధరకే ముడిచమురును దిగుమతి చేసుకునే అవకాశం కలుగుతుంది. ఇది రష్యా లేదా మధ్యప్రాచ్య దేశాలపై ఉన్న అతిగా ఆధారపడటాన్ని తగ్గిస్తుంది. అలాగే, ఇండోపసిఫిక్ ప్రాంతంలో చైనా ప్రాబల్యాన్ని అడ్డుకోవడంలో భారత్‌అమెరికా భాగస్వామ్యం కీలకం కాబట్టి, వెనెజువెలా విషయంలో అమెరికాకు వ్యతిరేకంగా వెళ్లకుండా ఉండటం ద్వారా రక్షణ మరియు సాంకేతిక రంగాలలో భారత్‌కు అమెరికా సహకారం మరింత బలపడవచ్చు. అమెరికా నేతృత్వంలో వెనెజువెలా చమురు మౌలిక సదుపాయాల పునరుద్ధరణ జరిగితే, భారత్ అక్కడ చిక్కుకుపోయిన తన పాత బకాయిలను వసూలు చేసుకునే వెసులుబాటు కూడా కలుగుతుంది. ఈ సంక్షోభం కేవలం అమెరికావెనెజువెలా మధ్య ఘర్షణ మాత్రమే కాకుండా, అంతర్జాతీయ వేదికపై అగ్రరాజ్యాల ఆధిపత్య పోరుకు వేదికగా మారింది. వెనెజువెలాలో మదురో ప్రభుత్వానికి రష్యా, చైనాలు వెన్నుదన్నుగా నిలుస్తూ వచ్చాయి. ఇప్పుడు అమెరికా నేరుగా సైనిక చర్యకు దిగడం ద్వారా ఈ దేశాల ప్రయోజనాలకు గండి కొట్టినట్లయింది. ముఖ్యంగా వెనెజువెలాలో చైనా పెట్టిన భారీ పెట్టుబడులు, రష్యాతో ఉన్న రక్షణ ఒప్పందాల నేపథ్యంలో, ఆ దేశాలు అమెరికా చర్యను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ క్రమంలో భారత్ ఏ పక్షం వహించకుండా 'చర్చల ద్వారా పరిష్కారం' అని పిలుపునివ్వడం ఒక ఆచరణాత్మక దౌత్య ఎత్తుగడ. ఒకవైపు అమెరికాతో తన వ్యూహాత్మక బంధాన్ని కాపాడుకుంటూనే, మరోవైపు రష్యా వంటి చిరకాల మిత్రదేశాల మనోభావాలను దెబ్బతీయకుండా భారత్ సమతూకాన్ని పాటిస్తోంది. వెనెజువెలాలో త్వరలో ఏర్పాటు కాబోయే మధ్యంతర ప్రభుత్వంలో భారత్ తన పట్టును ఎలా ప్రదర్శిస్తుంది, గతంలో నిలిచిపోయిన వాణిజ్య ఒప్పందాలను ఏ విధంగా పునరుద్ధరిస్తుంది అనే అంశంపైనే ఢిల్లీ దౌత్య విజయం ఆధారపడి ఉంటుంది. వెనెజువెలాలోని భారతీయ పౌరుల రక్షణ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అప్రమత్తమైంది. సుమారు 80 మందికి పైగా భారతీయులు అక్కడ ఉన్నట్లు సమాచారం, వారి భద్రత కోసం విదేశాంగ శాఖ నిరంతరం అక్కడి రాయబార కార్యాలయంతో సంప్రదింపులు జరుపుతోంది. అత్యవసర పరిస్థితులు తలెత్తితే వారిని సురక్షితంగా తరలించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అగ్రరాజ్యాల మధ్య పెనుగులాటలో ఒక స్వతంత్ర దేశం అల్లకల్లోలం కావడం ఆందోళనకరమే అయినప్పటికీ, భారత్ తన జాతీయ ప్రయోజనాలను, అంతర్జాతీయ సంబంధాలను సమతూకం చేసుకుంటూ ఆచితూచి అడుగులు వేస్తోంది. వెనెజువెలాలో రాజకీయ స్థిరత్వం ఏర్పడితే భారతీయ ఫార్మా మరియు మౌలిక సదుపాయాల కంపెనీలకు అక్కడ కొత్త మార్కెట్లు లభిస్తాయి. ఆయుధాల మోత ఆగి చర్చల ప్రక్రియ మొదలైనప్పుడే ఆ ప్రాంతంలో మళ్ళీ శాంతి నెలకొంటుంది. అంతర్జాతీయ చట్టాలను గౌరవిస్తూనే, మానవతా దృక్పథంతో ఈ సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత అంతర్జాతీయ సమాజంపై ఉంది. ఈ పరిణామాలు గ్లోబల్ సౌత్ దేశాలకు భారత్ నాయకత్వం వహించే తరుణంలో ఒక పెద్ద పరీక్షగా నిలవనున్నాయి.



(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

'బంగ్లాదేశ్‌లో రాజకీయ శూన్యత'



సుంకవల్లి సత్తిరాజు
9704903463

బంగ్లాదేశ్ లో బేగం ఖలీదా జియా శకం ముగిసింది. రాజకీయ,మత పరమైన విధ్వంస కాండ కొనసాగుతున్న నేపథ్యంలో వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల ఫలితం చూడకుండానే, అనారోగ్యంతో ఎనిమిది పదుల ప్రాయంలో తనువు చాలించిన ఖలీదా జియా తన రాజకీయ జీవితంలో అనేక ఒడిదుడుకులను ఎదుర్కొని బంగ్లాదేశ్ కు మూడు పర్యాయాలు ప్రధానిగా పని చేసారు. బేగం ఖలీదా జియా అవినీతి ఆరోపణల నేపథ్యంలో 17 సంవత్సరాల జైలు శిక్ష అనుభవించారు. ఆమె ప్రధానిగా ఉన్న కాలంలో బంగ్లాదేశ్ అత్యంత అవినీతి దేశంగా మారింది. ఖలీదా జియా తన భర్త జియా వుర్ రహ్మాన్ హత్య తర్వాత బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీకి నాయకత్వం వహించి, సైనిక తిరుగుబాటుకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య ఉద్యమంలో పాల్గొని, 1991 లో బంగ్లాదేశ్ కు తొలి మహిళా ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు. అవినీతి ఆరోపణల కారణంగా జైలు జీవితం గడుపుతున్న ఖలీదా జియా కు షేక్ హసీనా పదవీచ్యుతి కారణంగా, అనేక రాజకీయ కారణాలతో కొంత వరకు ఉపశమనం లభించింది. అనేక దీర్ఘరోగాల ఫలితంగా ఆసుపత్రికి తరలించిన ఖలీదా కు 2024 లో అవినీతి కేసుల నుండి విముక్తి లభించింది. 1977 లో బంగ్లాదేశ్ అధ్యక్షుడైన ఖలీదా జియా భర్త జియావుర్ రహమాన్ 1981 చివరిలో హత్య గావించబడ్డాడు. ఆ తర్వాత కాలంలో బి.ఎన్.పి కి నాయకత్వం వహించి బంగ్లాదేశ్ ప్రధానిగా తనదైన శైలిలో పని చేసారు. తూర్పు పాకిస్తాన్ నుండి 1971 లో బంగ్లాదేశ్ విమోచనం పొందిన తర్వాత 'బంగ బంధు' గా పిలవబడ్డ షేక్ ముజిబర్ రహ్మాన్ ఆ దేశానికి మొదటి అధ్యక్షుడయ్యారు. ఆ తర్వాత ప్రధానిగా పనిచేసారు. సైనిక తిరుగు బాట్లు, కక్షసాధింపులు, రాజకీయ నాయకుల హత్యలు బంగ్లాదేశ్ రాజకీయాల్లో కొత్తేమీ కాదు. 1975 సైనిక తిరుగు బాటులో షేక్ ముజిబర్ రహ్మాన్ హత్య గావించబడిన తర్వాత జరిగిన సైనిక తిరుగుబాటుపై ప్రజాస్వామ్య ఉద్యమాలు జరిగాయి. షేక్ హసీనా, ఖలీదాలను 'ది బ్యాటిల్ ఆఫ్ ది బేగమ్స్' అని పిలుస్తారు. ఇద్దరూ సైనిక తిరుగుబాట్లకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య కోసం పనిచేసి బంగ్లాదేశ్ ప్రధానులు గా రాణించారు. షేక్ హసీనా, ఖలీదా జియాలకు చెందిన అవామీ లీగ్, బి.ఎన్.పి ల మధ్య పచ్చిగడ్డి వేస్తే భగ్గుమనే వైరం నేటికీ కొనసాగుతున్నది. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో హసీనా కు చెందిన అవామీ లీగ్ పోటీ చేయకుండా నిషేధించడంతో ఖలీదా కుమారుడైన తారిక్ రహ్మాన్ విజయం నల్లేరుపై నడక లా మారింది. పైగా పదవి కోల్పోయి ఉరిశిక్ష పడ్డ హసీనా పై బంగ్లాదేశ్ లోని విద్యార్థులు, పాక్ ప్రేరిత తీవ్ర వాదులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తరుణంలో అవామీ లీగ్ పార్టీ లేకుండా జరగబోయే ఎన్నికల్లో బి ఎన్.పి కి అనూకూలంగా ఫలితాలొచ్చే అవకాశాలున్నాయి. ప్రధాన పార్టీ లేకుండా జరగబోయే ఎన్నికలు ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించలేవు. వచ్చే ఫిబ్రవరి లో జరిగే ఎన్నికల్లో తారిక్ రహ్మాన్ నాయకత్వంలోని బి. ఎన్. పి విజయం సాధించినా ఆ ప్రభుత్వం కూడా ఎంతో కాలం మనుగడ సాగించలేదు. అవినీతి ఆరోపణలపై సుదీర్ఘ కాలం శిక్ష అనుభవించి, జీవిత చరమాంకంలో నిర్దోషిగా నిరూపించ బడ్డ ఖలీదా జియా ఎనిమిది పదుల ప్రాయంలో శాశ్వత నిద్రలోకి జారిపోయారు. ఖలీదా భారత్ పట్ల ఎలాంటి వైఖరి ప్రదర్శించినా, ప్రజాస్వామ్య ప్రక్రియలో చురుకైన పాత్ర వహించడం విశేషం. బంగ్లాదేశ్ లో ఎవరు అధికారం లోకి వచ్చినా భారత్ తో సత్సంబంధాలు నెలకొల్పుకోకుండా, పాక్ తో అంటకాగి, భారత్ పై విద్వేషం వెళ్ళగక్కితే బంగ్లాదేశ్ భవితవ్యం ప్రశ్నార్ధకం కాగలదు. ఖలీదా అస్తమయంతో ఆమె కుమారుడు తారిక్ రహ్మాన్ బంగ్లాదేశ్ రాజకీయాల్లో పట్టు సాధించగలరా? లేక బంగ్లాదేశ్ పూర్తి స్థాయిలో సైన్యం చేతుల్లోకి పోతుందా? అనే సంశయం ఏర్పడిన నేపథ్యంలో త్వరలోనే బంగ్లా భవితవ్యం పై ఒక స్పష్టత ఏర్పడే అవకాశముంది. ఒక వైపు పాకిస్తాన్, మరోవైపు బంగ్లాదేశ్ భారత్ సమగ్రతకు ముప్పు కలిగించే రీతిలో వ్యవహరిస్తున్నాయి. డోనాల్డ్ ట్రంప్ ఈ పరిస్థితులను తనకు అనుకూలంగా మలచుకుని భారత్ ను దెబ్బ తీయడానికి శతవిధాలా ప్రయత్నాలు చేస్తున్నాడు. పుతిన్ ను అరెస్టు చేస్తానంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఎటు వైపు దారి తీస్తాయో తెలియదు. మోడీ తన మిత్రుడంటూనే ,తాను సంతోషంగా లేనని తనను సంతోష పెట్టడం భారత్ కు అవసరమంటూ ట్రంప్ నర్మగర్భితంగా చేసిన ప్రకటనలోని హెచ్చరికను అవగతం చేసుకుని, భారత్ అప్రమత్తంగా మెలగాలి. బంగ్లాదేశ్ భారత్ పట్ల చూపుతున్న విద్వేష భావం అత్యంత గర్హనీయం. ఖలీదా జియా స్థానంలో బంగ్లాదేశ్ రాజకీయాలను శాసించాలనుకుంటున్న తారిక్ రహ్మాన్ వచ్చే బంగ్లా సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించి అధికారం లోకి వస్తే, భారత్ పట్ల ఎలాంటి వైఖరి ప్రదర్శిస్తారో వేచి చూడాలి. ఏది ఏమైనప్పటికీ బేగం సిస్టర్స్ లో ఒకరైన షేక్ హసీనా దేశం విడిచి, భారత్ లో ఆశ్రయం పొందుతూ, బంగ్లా రాజకీయాల్లో ఎలాంటి పాత్ర పోషించలేని పరిస్థితుల్లో ఉండడం, మరో వైపు బేగం ఖలీదా జియా అస్తమించడంతో బంగ్లాదేశ్ లో పెద్దతరం రాజకీయ నాయకత్వం లేమి కనబడుతున్నది.




(వ్యాస రచయిత సామాజిక విశ్లేషకులు, మోటివేషనల్ స్పీకర్)

నడకకు ప్రాణం పోసిన వైద్యుడు సేథీ



సుధాకర్.ఏ.వి
9000674747

మయూరి సినిమా చూసుంటే అందులో మయూరి అనే భరతనాట్యం డాన్సర్ ప్రమాదానికి గురై ఒక కాలును కోల్పోతుంది. అయినా.. నిరాశకు గురికాకుండా కృత్రిమ కాలు అమర్చుకుని, కష్టపడి సాధన చేసి, తన నాట్య ప్రదర్శనలతో అందరి మన్ననలు పొందుతుంది. సినిమాలో మయూరి పాత్ర పోషించిన నటి.. సుధా చంద్రన్ కాగా.. నిజ జీవితంలో ఆ కృత్రిమ కాలును రూపొందించిన వైద్యుడే.. డా. ప్రమోద్ కరణ్ సేథీ. ప్రమాదాల్లో కాళ్ళు కోల్పోయి ఇంటికే పరిమితమై, కుమిలిపోతున్న లక్షలాది మందిని సేథీ రూపొందించిన కృత్రిమ కాళ్ళు నడిపించాయి. జైపూర్ ఫుట్ గా పేరొందిన ఈ ఆవిష్కరణ.. వికలాంగుల జీవితాల్లో కొత్త ఆశలను చిగురింపజేసింది. సేథీ 1927 నవంబర్ 28న వారణాసిలో జన్మించారు. ఆర్థోపెడిక్ సర్జన్ గా పేరు సంపాదించిన సేథీ ప్రమాదవశాత్తూ కాళ్లు పోగొట్టుకొని, తమ పని తాము చేసుకోలేని స్థితిలో ఉన్న వికలాంగులకు ఏదైనా చేయాలని తపించేవాడు. ఈ క్రమంలో 1969లో నిరక్ష్యరాస్యుడైన రామచంద్ర శర్మ పరిచయమయ్యాడు. శర్మ రబ్బరు, చెక్క, అల్యూమినియం వస్తువులను మిషన్ మీద పనిచేసే వాడు. సేథీ మేథస్సు, శర్మ తోడ్పాటుతో వీరిద్దరూ కలసి ఓ చిన్న వర్క్ షాప్ లో తొలిసారి జైపూర్ పాదాన్ని తయారుచేశారు. 1975కి ముందు కృత్రిమ కాలు అమర్చు కోవాలంటే చాలా డబ్బు ఖర్చు చేయాల్సి వచ్చేది. ఆ తర్వాత చౌకగా, స్థానికంగా దొరికే వస్తువులతో పెద్ద సంఖ్యలో జైపూర్ పాదాల తయారీ చేసిన సేథీ ఆయన బృందం అత్యంత చౌకగా సామాన్యులు సైతం కృత్రిమ కాలును అమర్చుకునే ఏర్పాటు చేశారు. అంతేకాదు.. కోల్డ్ వార్ సందర్భంగా రష్యా అమర్చిన మందుపాతరలు పేలి కాళ్లు తెగిపోయిన వేలమంది సైనికులకు ఆ సమయంలో అంతర్జాతీయ రెడ్ క్రాస్ సంస్థ వారందరికీ సేథీ రూపొందించిన కృత్రిమపాదాలు అందించటంతో సేథీ పేరు ప్రపంచవ్యాప్తంగా మారుమోగిపోయింది. సేథీ సృష్టించిన పాదం మొదటి సాంకేతిక ప్రదర్శన చేసినప్పుడు, దానిని సేథి పాదం అని పిలవమని ఎంతో మంది అతనికి సలహాలు ఇచ్చారు, అయితే దానికి నిరాకరించి తన పేరుకు బదులుగా అతడి కర్మ భూమి (పని ప్రదేశం) అయిన నగరం పేరు మీద" జైపూర్ పాదం" అని పేరు పెట్టాడు. సేథీ తన ఆవిష్కరణకు హక్కులు (పేటెంట్) పొందలేదు, ఈ పాదం తయారుచేయడం చాలా సులభమని, దీనిని స్థానిక కళాకారుడితో ఏ గ్రామంలోనైనా తయారు చేయవచ్చని ప్రతి ఒక్కరు ఉత్పత్తి చేయనివ్వండి అతని అభిప్రాయం. జైపూర్ అవయవ నమూనా లండన్ లోని ఇంపీరియల్ వార్ మ్యూజియంలో ల్యాండ్ మైన్ విభాగంలో ప్రదర్శనకు ఉంచారు. ప్రమోద్ కుమార్ సేథీ సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం ఆయనను పద్మశ్రీ పురస్కారంతో గౌరవించింది. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక మందికి కృత్రిమ కాలు అమర్చిన సేథీ పేరు గిన్నిస్ బుక్ రికార్డుల్లోకీ ఎక్కింది. ఆసియాలోనే అత్యుత్తమమైన రామన్ మెగసెసె అవార్డు కూడా సేథీని వరించింది. ఇవిగాక పలు జాతీయ, అందర్జాతీయ అవార్డులెన్నో ఆయనను వరించాయి. కాళ్ళు కోల్పోయిన ఎందరో అభాగ్యులను తిరిగి నడిపించి, వారి జీవితాల్లో వెలుగును నింపిన సేథీ.. 2008, జనవరి 6న జైపూర్లో కన్నుమూశారు.



జనవరి 6 ప్రమోద్ కుమార్ సేథీ వర్ధంతి

(వ్యాస రచయిత స్టేట్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula
@gmail.com
90102 23917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008



ప్రాంతీయం

జ్ఞాపకాలను గుర్తుచేసిన 'హోంకమింగ్'



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 5 : హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ఇటీవల పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని 'హోంకమింగ్ 2025' పేరిట నిర్వహించినట్టు డైరెక్టర్ బందన్ కుమార్ మిశ్రా సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు, ప్రస్తుత విద్యార్థులను ఒకచోట చేర్చి, ఉమ్మడి వారసత్వం, శాశ్వత సంబంధాల వేడుకలో ఒక చిరస్మరణీయమైన మైలురాయిగా నిలిచిపోయేలా చేసిందన్నారు. ఇందులో పాల్గొన పూర్వ విద్యార్థులు తమ ప్రియమైన జ్ఞాపకాలను తిరిగి గుర్తుచేసుకోవడం, వ్యక్తిగత అనుభవాలను ఇతరులతో పంచుకోవడం, వారి వృత్తిపరమైన ప్రయాణాలపై అవగాహనను కల్పించినట్టు తెలియజేశారు. అర్థవంతమైన సంభాషణలకు ఒక శక్తివంతమైన వేదికను ఈ కార్యక్రమం అందించిందన్నారు. విద్యార్థులలో ప్రేరణను పెంపొందిస్తూ విద్యాసంస్థ, దాని పూర్వ విద్యార్థుల మధ్య జీవితకాల బంధాన్ని బలోపేతం చేసినట్టు డైరెక్టర్ తెలిపారు. ఇది గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ యొక్క శాశ్వత వారసత్వానికి, బలమైన, విద్యా సమాజాన్ని పెంపొందించడానికి దాని నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమాన్ని ఒక తీపి జ్ఞాపకంగా మార్చిన పూర్వ విద్యార్థులు, అతిథులందరికీ డైరెక్టర్ మిశ్రా ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ముఖ్యంగా పూర్వ విద్యార్థుల సమన్వయకర్త స్నేహ ఎస్. రెడ్డిని ఆయన అభినందించారు. ఆమె సూక్ష్మ ప్రణాళిక, సమన్వయం ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించాయని ప్రశంసించారు. భవిష్యత్తును రూపొందించడంలో సమాజం, ఉమ్మడి చరిత్ర, సామూహిక వృద్ధి యొక్క ప్రాముఖ్యతను గుర్తుచేసే శక్తివంతమైన సాధనంగా ఈ హోంకమింగ్ నిలిచిందన్నారు. ఈ సంబంధాలను బలోపేతం చేయడానికి, రాబోయే తరాలకు చెందినవారనే భావాన్ని పెంపొందించడానికి స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ కట్టుబడి ఉందన్నారు.

కామారెడ్డి జిల్లా పర్యాటకానికి కొత్త శోభ

- కౌలాస్ కోట, నిజాం సాగర్, నాగన్న (మెటల్) బావిని పర్యాట కేంద్రంగా తీర్చిదిద్దుతాం
- రూ. 9.97 కోట్లతో నిజాం సాగర్ వద్ద ఎకో-టూరిజం అభివృద్ధి
- కౌలాస్ కోట పునరుద్ధరణకు రూ. 5 కోట్ల ప్రతిపాదనలు
- శాసనసభలో మంత్రి జూపల్లి కృష్ణారావు



ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, డిసెంబర్ 5: కామారెడ్డి జిల్లాలోని జుక్కల్ నియోజకవర్గాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తోందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో కౌలాస్ కోట, నిజాం సాగర్ పర్యాటకాభివృద్ధిపై జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత రావు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ.. జుక్కల్, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. స్వదేశ్ దర్శన్ 2.0 లోని CBDD (ఛాలెంజ్ బేస్డ్ డెస్టినేషన్ డెవలప్‌మెంట్) ఉప పథకం కింద 2025 సంవత్సరంలో కామారెడ్డి జిల్లాలోని నిజాం సాగర్ వద్ద ఎకోటూరిజం అభివృద్ధికి రూ. 9.97 కోట్లతో ఎకో టూరిజం పనులు చేపట్టినట్లు మంత్రి చెప్పారు. నిజాం సాగర్ సహజసిద్ధ ప్రకృతి అందాలను కాపాడుతూ, ఒక స్థిరమైన, పర్యావరణ అనుకూల పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే ఈ ప్రాజెక్ట్ లక్ష్యమని, ప్రస్తుతం ఈ పనులు పురోగతిలో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నిధులతో 17 పర్యావరణ అనుకూల మాడ్యులర్ కాటేజీలు, రెస్టారెంట్, డైనింగ్ సౌకర్యాలు, స్పా, వెల్నెస్ సెంటర్, సుందరమైన ప్రవేశ ద్వారాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. పర్యాటకుల సౌకర్యార్థం ల్యాండ్‌స్కేపింగ్, పాదచారుల మార్గాలు, ఇతర ప్రాథమిక మౌలిక సదుపాయాల పనులు ప్రస్తుతం పురోగతిలో ఉన్నాయని వెల్లడించారు. జుక్కల్ అసెంబ్లీ నియోజకవర్గంలో పర్యాటక మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి, పర్యావరణ,వారసత్వ పర్యాటకాన్ని ప్రోత్సహించడానికి, స్థానిక యువతకు ఉపాధి కల్పించడానికి, కామారెడ్డి జిల్లాలో సమతుల్య ప్రాంతీయ అభివృద్ధి కోసం ప్రభుత్వం నిబద్ధతతో పని చేస్తోందని అన్నారు.

చారిత్రక కోట3కు పునర్జీవం

పురావస్తు శాఖ పరిధిలోని చారిత్రక కౌలాస్ కోట సంరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి చెప్పారు. ఇప్పటికే 13వ ఆర్థిక సంఘం నిధులతో రూ. 50 లక్షల అంచనా వ్యయంతో కొన్నిసంరక్షణ పనులు చేపట్టామని, కోటను పూర్తిస్థాయిలో పునరుద్ధరించేందుకు రూ. 5 కోట్లు మంజూరు చేయాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఆయన సభకు తెలియజేశారు. ఈ ప్రాజెక్టుల ద్వారా స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ హాస్టల్లను ప్రత్యేక అధికారులు తనిఖీ చేయాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్


ప్రతిపక్షం, హనుమకొండ, జనవరి 5: ప్రభుత్వ వసతి గృహాలను ప్రత్యేకాధికారులు నెలలో రెండు సార్లు తప్పనిసరిగా తనిఖీ చేయాలని, టీచర్లు లేకుండా విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను వినాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మండల ప్రత్యేకాధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజావాణి కార్యక్రమం అనంతరం మండల ప్రత్యేక అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ వసతి గృహాల్లో ఫిర్యాదుల పెట్టె (కంప్లైంట్ బాక్స్) తప్పనిసరిగా ఉండాలని దానికి సంబంధించిన తాళం ప్రత్యేక అధికారి వద్ద మాత్రమే ఉండాలన్నారు. వసతి గృహాల్లో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి విద్యార్థుల ఆరోగ్య సమస్యలను పర్యవేక్షించాలన్నారు. వసతి గృహాల్లో ప్రధానంగా విద్యా, ఆరోగ్యం, శానిటేషన్ పట్ల ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా లేదా పరిశీలించాలన్నారు. వసతి గృహాల తనిఖీ సందర్భంలో మండల ప్రత్యేక అధికారులు విద్యార్థులతో కలిసి భోజనం చేయాలన్నారు. వారి సమస్యలను విని అక్కడికక్కడే పరిష్కరించాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మద్యం బాటిల్ లో డ్రగ్స్

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 05 : సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ఎక్సైజ్ పరిధిలోని చిరాగ్‌పల్లి ప్రాంతంలో ఎక్సైజ్ టీమ్‌లు చేపట్టిన తనిఖీల్లో మద్యం నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్ బాటిళ్లు, ఎండీఎం డ్రగ్స్ పట్టుబడ్డాయి. నమోదు చేసిన మూడు కేసుల్లో 0.42 గ్రాముల ఎండీఎంఎ డ్రగ్స్, మరో రెండు కేసుల్లో 13.8 లీటర్ల ఎన్‌డీపీఎల్, 8.8 లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు మెదక్ డిప్యూటి కమిషనర్ హరికిషన్ తెలిపారు. ఈ కేసుల్లో కే.అనురుథ్‌రెడ్డి, ఐ జగదీష్ వర్మ, ఎస్. రమేష్‌లను అరెస్టు చేసి జహీరాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌లో పాల్గోన్నారు.ఈ తనిఖీల్లో సంగారెడ్డి డీటీఎఫ్, జహీరాబాద్ టీమ్‌ల పాల్గన్నాయి.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని నిరాహార దీక్ష



ప్రతిపక్షం, మంచిర్యాల, జనవరి 5: బీసీ కులస్తులకు చట్టసభల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో గల గాంధీ పార్కు వద్ద సింగరేణి విశ్రాంత ఉద్యోగి పద్మశాలి కుల సంఘ నాయకులు గజల్ వెంకటయ్య గాంధీ విగ్రహం వద్ద నిరాహార దీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న మున్సిపల్ ఎన్నికలకు ముందే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని అన్నారు రాష్ట్ర ముఖ్యమంత్రి అఖిలపక్ష నాయకురాలు ఢిల్లీకి తీసుకెళ్లి ప్రధానమంత్రి సమక్షంలో చట్టసభలు 42 శాతం రిజర్వేషన్ కల్పించే విధంగా బీసీలకు న్యాయం చేయాలన్నారు. అనేక ఏళ్ల తరబడి గత టీఆర్ఎస్ ప్రభుత్వం సైతం బీసీలకు అన్యాయం చేయడం జరిగింది అన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ బీసీలకు రిజర్వేషన్ కల్పిస్తామని ఇచ్చిన హామీని మరిచిందన్నారు. వెంటనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించి తొమ్మిదవ షెడ్యూల్లో చర్చలు అన్నారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేయనున్నట్లు పేర్కొన్నారు.



ప్రజావాణి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

- జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 5 : ప్రజావాణిలో వచ్చిన సమస్యల సత్వర పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అధికారులకుసూచించారు . కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ సమస్యలపై జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అడిషనల్ కలెక్టర్లుమాధురి, పాండు, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతిలతో కలిసి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జీదారులు భూ సమస్యలు, ఆసరా పింఛన్లు, ఉద్యోగ కల్పన,తదితర అంశాలతో పాటు పంచాయతి, వ్యవసాయ, డి డబ్ల్యూ ఓ, హౌసింగ్, లేబర్, పి డబ్ల్యూ డి, డి ఆర్ డి ఓ, మున్సిపల్, రెవెన్యూ, బి సి డి ఓ, మైన్స్, డి ఎస్ సి ఓ తదితర శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను కలెక్టర్ కు అందజేశారు. ఆయా వినతులను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకుఆదేశించారు.ప్రజావాణి లో 42 అర్జీలు అందాయని తెలిపారు. ఈ సందర్భముగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమమని , అర్జిదారుల సమస్యలను వెంట వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, రెవిన్యూ డివిజనల్ అధికారులు, మున్సిపల్ కమీషనర్లు, కలెక్టరేట్ ఏ ఓ, ప్రజలు, పాల్గొన్నారు .




జిల్లా జడ్జి, సీపీలను కలిసిన కలెక్టర్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 5 : నిజామాబాద్ జిల్లా పాలనాధికారిగా ఇటీవలే బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం జిల్లా న్యాయమూర్తి జీ.వీ.ఎన్.భరతలక్ష్మిని, పోలీస్ కమిషనర్ సాయి చైతన్యలను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా న్యాయస్థానాల సముదాయ భవనంలోని జిల్లా జడ్జి ఛాంబర్లో ఆమెకు పూల మొక్కను అందించారు. జిల్లా స్థితిగతులపై, న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలపై వారు కొద్దిసేపు చర్చించారు. అనంతరం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సీపీని కలిసి పూల బొకే అందించారు.

హత్య కేసులో ఒకరికి ఉరిశిక్ష

- నిజామాబాద్ న్యాయస్థానం సంచలన తీర్పు

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 5 : హత్య కేసులో నిందితుడికి ఉరిశిక్ష విధిస్తూ నిజామాబాద్ జిల్లా న్యాయస్థానం సోమవారం సంచలన తీర్పు వెలువరించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ..నగరంలోని నాగారం బ్రాహ్మణ్‌కాలనీకి చెందిన ఆటోడ్రైవర్ సందీప్, అదే కాలనీకి చెందిన సతీష్‌గౌడ్ లు స్నేహితులు. అయితే గత సంవత్సరం వీరిద్దరికి ఆటో విషయంలో గొడవలు జరిగాయి. దీనిని మనసులో పెట్టుకున్న సతీష్ గౌడ్ సందీప్‌ను ఎలాగైనా హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. ఇందులో భాగంగా గతేడాది సతీష్ గౌడ్ సందీప్‌ను ఇందల్వాయికి తీసుకెళ్లాడు. అక్కడ ఇద్దరు మద్యం సేవించిన అనంతరం సందీప్‌ను పెట్రోల్ పోసి తగులబెట్టాడు. అనంతరం ఆటో తీసుకుని పారిపోయాడు. ఫిబ్రవరి 15 న ఉదయం 6:30 గంటలకు ఆటో నడపడానికి వెళ్లిన సందీప్ తిరిగి రాకపోవడంతో, కుటుంబ సభ్యులు వెతికినా ఫలితం లేకపోవడంతో సందీప్ భార్య కండేల లత 2025 ఫిబ్రవరి 16న 5వ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న ఐదో టౌన్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో సతీష్ గౌడ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నిందితుడు మద్యం, తాటి కల్లు అలవాట్లకు లోనై, లాభం కోసం నేరాలకు పాల్పడినవాడని తేలింది. ఆటో సెల్ ఫోన్ కోసం ఫిబ్రవరి 15 న మృతుడిని మత్తులోకి తీసుకెళ్లి , చంద్రాయణపల్లి గ్రామ శివారు అటవీ ప్రాంతం (ఎన్ హెచ్ 44) వద్ద తోసి పడగొట్టి , రాయితో ఛాతిపై కొట్టి హత్య చేసి , ఆధారాలు నశింపజేయడానికి మృతదేహాన్ని కాల్చి , ఆటో మరియు సెల్ ఫోన్‌ను అపహరించి పారిపోయాడు. అనంతరం పోలీసులు సాంకేతిక ఆధారాలతో నిందితుడిని పట్టుకొని విచారించగా నేరాన్ని స్వచ్ఛందంగా ఒప్పుకొని , సంఘటన స్థలం , ఉపయోగించిన రాయి , దొంగతనానికి గురైన ఆటో మరియు సెల్ ఫోన్‌ను చూపించాడు. సీసీటీవీ ఫుటేజ్ ద్వారా నిందితుడు, మృతుడు కలిసి ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరు పరచారు. ఈ కేసును విచారించిన జిల్లా న్యాయమూర్తి డి. దుర్గా ప్రసాద్ 238 బీఎన్ఎస్ ప్రకారం ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, 307 బీఎన్ఎస్ కింద ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5వేల జరిమానా, 103 బీఎన్ఎస్ కింద రూ. 10వేలు, మరణ శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారని సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఇట్టి కేసులో నేరస్తునికి శిక్షపడేలా కృషి చేసిన పోలీస్ సిబ్బందిని పోలీసు కమీషనర్ అభినందించారు. జిల్లాలో ఉరి శిక్ష తీర్పు ఇది రెండవ తీర్పు కావటం గమనార్హం.



50 లక్షలు దుర్వినియోగం

- ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్ జనవరి 5 : నగునూరు గ్రామ అభివృద్ధి గురించి మంజూరైన ఎంజీఎన్ ఆర్ఈజీఎస్ నిధుల నుండి రూ.లు 50లక్షల నిధులను నగునూరు గ్రామ ప్రజల సౌకర్యార్థం కొరకు వినియోగించకుండా 1,2 డివిజన్ మాజీ బి.జె.పి. కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ తన స్వంత ఫామ్ హౌజ్ వ్యవసాయ భూముల కొరకు నగునూరు గ్రామములో వేయవలసిన సి.సి. రోడ్డు మరియు డ్రైనేజిని వేయవలసిన దానిని తన స్వంత ప్రయోజనాల కోసం వాడుకున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ నాయకులు ప్రజావాణి లో కలెక్టర్'కు పిర్యాదు చేశారు. నిధుల దుర్వినియోగం పై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రోడ్డు వేసిన కాంట్రాక్టర్లపై తగు చర్యలు తీసుకొని ప్రజాధనాన్ని దుర్వినియోగం కాకుండా కాపాడాలని కోరారు. పిర్యాదు చేసిన వారిలో నగునూరు గ్రామస్థులు మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షులు సాయిల్ల రాజు, మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కొత్తకొండ కొమురయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు తాళ్ళపెల్లి శేఖర్ గౌడ్, బండివెల్లి ప్రవీణ్ కుమార్ తదితరులు నేడు ప్రజావాణిలో కరీంనగర్ జిల్లా కలెక్టర్ గారికి రాసిన ఫిర్యాదు లేఖను అదనపు కలెక్టర్ కు అందజేశారు.

ప్రజావాణికి జిల్లా అధికారులు హాజరు కావాలి

- స్పష్టం చేసిన కలెక్టర్ ఇలా త్రిపాఠి



ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 5: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. ఈ కార్యక్రమానికి ఉన్న ప్రాధాన్యతను గుర్తెరిగి జిల్లా అధికారులే స్వయంగా ప్రజావాణిలో పాల్గొనాలని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్ లతో కలిసి కలెక్టర్ ప్రజావాణి ఫిర్యాదులు స్వీకరించారు. 70 వినతులు అందగా, వాటి పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు అందించారు. ప్రజావాణి వినతుల స్వీకరణ పూర్తయిన అనంతరం అధికారులకు కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను వెంటవెంటనే పరిశీలించి, పరిష్కారానికి అనువుగా ఉన్న వాటిని తక్షణమే పరిష్కరించాలని సూచించారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న తరహాలోనే జిల్లా ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారం ప్రగతిని పర్యవేక్షించేందుకు ఆన్లైన్ విధానాన్ని అవలంభిస్తామని తెలిపారు. తమ సమస్యలు పరిష్కారం అవుతాయనే నమ్మకంతో ప్రజలు తరలివచ్చి ప్రజావాణిలో వినతులు, ఫిర్యాదులు అందిస్తారని, జిల్లా అధికారులు అందుబాటులో ఉంటూ పరిష్కరించేందుకు అనువుగా ఉన్న వాటిని అప్పటికప్పుడే పరిష్కరించాలని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు జిల్లా ప్రగతిలో క్రియాశీలక పాత్ర పోషించాలని, క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఆయా కార్యక్రమాలు, పథకాల అమలు తీరును నిశితంగా పరిశీలించాలని కలెక్టర్ మార్గనిర్దేశం చేశారు. ప్రతి శాఖ పనితీరు సమర్థవంతంగా ఉండాలన్నారు. మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశాలు ఉన్నందున, సంబంధిత అధికారులు అన్ని విధాలుగా సన్నద్ధం కావాలని అన్నారు. ముఖ్యంగా ఓటరు జాబితాలో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ఎలాంటి ప్రలోభాలు, ఒత్తిళ్లకు తావులేకుండా పారదర్శకంగా ఎన్నికల విధులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, ఫాం6, ఫాం7 పరిష్కారంలో స్పష్టమైన ప్రగతి కనిపించాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, హౌసింగ్ పీ.డీ పవన్ కుమార్, నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్ రెడ్డి తదితరులు ఫిర్యాదులు స్వీకరించగా, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. అనంతరం అధికారులు కలెక్టర్ ను ఆమె ఛాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలు అందించారు.



బీఆర్ఎస్ భవన్ సాక్షిగా హరీష్ రావు అబద్ధాలు

- త్వరలోనే కేసీఆర్ కుటుంబం జైలుకు వెళ్లడం ఖాయం
- సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్

ప్రతిపక్షం బ్యూరో, సిద్ధిపేట, జనవరి 5: అబద్ధల పునాది మీద ఏర్పాటు అయిన బిఆరెస్ భవన్ సాక్షిగా ఎమ్మెల్యే హరీష్ రావు నదీ జలాలపై వాస్తవం నిజం మాట్లాడకుండా అబద్ధాలు మాటాడటం సిగ్గుచేటు అని అన్నారు. సిద్దిపేట లో సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రజలు నమ్మి 10 సంవత్సరాలు కెసిఆర్ కు అధికారం ఇస్తే ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోలేదు అని అన్నారు. నదీ జలాలపై తెలంగాణకు రావలసిన వాటాపై అసెంబ్లీలో మాటాడకపోవడం బాధాకరం అని అన్నారు. అసెంబ్లీలో మాట్లాడితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులు అడిగే ప్రశ్నలకు సమాధానం లేకపోవడంతోనే ఎదుర్కొలేక బిఆరెస్ వాకౌట్ డ్రామా చేశారు అని అన్నారు. కెసిఆర్ కుటుంబ సభ్యులు చేసిన తప్పులపై నిజాలు ప్రజలకు తెలుస్తాయని రాజకియ ఉనికి కాపాడుకునేందుకు ప్రజలను కావాలని తప్పుదారి పట్టిస్తున్నారు అని అన్నారు. బిఆరెస్ పార్టీ ను కుక్కతో కెసిఆర్ కుమార్తె కవిత పోల్చింది అని అన్నారు. 10 సంవత్సరాలలో కెసిఆర్ కుటుంబం రాష్ట్రాన్ని పందికొక్కుల్లా దండుకున్నారు అని అన్నారు. భూకబ్జాలు భూదందాలు దోపిడీ చేసిన కెసిఆర్ కుటుంబంను ప్రజలు క్షమించరు అని అన్నారు. ఆర్థిక మోసానికి పాల్పడిన కెసిఆర్ కుటుంబ సభ్యుల నుండి దోచుకున్న డబ్బు కబ్జా చేసిన భూములను ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వాధీనం చేసుకోవాలి అని అన్నారు. త్వరలోనే కెసిఆర్ కుటుంబం జైలుకు వెళ్లడం ఖాయం అని వారు చేసిన పాపాలే వారు అనుభవిస్తారు అని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి కావాలంటే మరో 10 సంవత్సరాలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రజలు ఆశీర్వదించల్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్యాదర్ మధు గాయాజుద్దీన్ హర్షద్ బాబా విజయ్ దానియల్ శేషు. రాజా రెడ్డి సంతోష్ గౌడ్. నజ్జు. తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వాన్ని నిలదీస్తామని బీరాలు పలికిన బీఆర్ఎస్ సభ్యులు సభనుంచి జారుకున్నారు. శాసన సభలో ముఖ్యమైన అంశాలపై చర్చ జరిగే సమయంలో ప్రధాన ప్రతిపక్షం గైర్హాజరు కావడం సరికాదు. వాస్తవాలను ప్రజల ముందు ఉంచేందుకే ప్రభుత్వం సభలో కృష్ణా జలాలపై ప్రజెంటేషన్ ఏర్పాటుచేసింది. దీనిపై అభ్యంతరాలుంటే సభలో చెప్పాలి కానీ బయట చెప్పడం ఎంతవరకు సమంజసం.

- మంత్రి శ్రీధర్‌బాబు

ప్రాంతీయం



ప్రజల ఆకాంక్షకు నిదర్శనంగా నిలవాలి

- ఎస్సీ,ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

ప్రతిపక్షం, గజ్వేల్, జనవరి 5: గజ్వేల్ మండలంలో ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా, ఉప సర్పంచ్‌గా, వార్డు సభ్యులుగా విజయం సాధించిన వారికి డిబిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్సి,ఎస్టి సర్పంచ్ ల సన్మాన కార్యక్రమంలో ఎస్సి,ఎస్టి కమీషన్ చైర్మన్ శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా కమీషన్ చైర్మన్ మాట్లాడుతూ ఎన్నికైన సర్పంచ్, ఉప సర్పంచ్‌లు గ్రామ అభివృద్ధి దిశగా సమన్వయంతో పనిచేసి గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజల విశ్వాసానికి అనుగుణంగా పని చేసి ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి,డిబిఎఫ్ జిల్లా కార్యదర్శి వేణు పాల్గొన్నారు.



మల్లన్న కళ్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే రోహిత్ రావు

ప్రతిపక్షం, మెదక్ టౌన్, జనవరి 5: మెదక్ జిల్లా కేంద్రమైన నవాబ్ పేటలో గొల్ల కురుమ సంఘం ఆధ్వర్యంలో మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది.ఈ మహోత్సవంలో మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు పాల్గొని మల్లికార్జున స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..మల్లన్న స్వామి ఆశీస్సులతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో తీసుకెళ్తానని అన్నారు. మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొనడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు.అనంతరం ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ దొంతి. లక్ష్మి ముత్యం గౌడ్, నవాబ్ పేట గొల్ల కురుమ సంఘం సభ్యులు,కాంగ్రెస్ పట్టణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సీనియారిటీ ఆధారంగా పరీక్షల విధులు కేటాయించాలి

- జీజెఎల్ఏ జిల్లా అధ్యక్షులు సుధాకర్ రెడ్డి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, జనవరి 5: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ థియరీ వార్షిక పరీక్షల్లో సీనియారిటీ ఆధారంగా అధ్యాపకులకు పరీక్షల విధులను కేటాయించాలని ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం జిల్లా అధ్యక్షులు ఏడబోయిన సుధాకర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా ఇంటర్ అధికారి డిఐఈఓ రవీందర్ రెడ్డి కి వినతి పత్రాన్ని సమర్పించారు.అనంతరం డిఐఈఓ ను సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ వార్షిక పరీక్షల నిర్వహణకు తమ సంఘం అన్ని విధాలుగా పనిచేస్తుందని చెప్పారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన వాతావరణాన్ని తయారు చేయడంలో తన సంఘ సభ్యులు సంపూర్ణంగా అధికారులకు సహకరించేలా సూచన చేస్తామన్నారు. తమ విన్నపానికి సానుకూలంగా స్పందించిన డి ఐ ఈ ఓ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అమరేందర్ రెడ్డి, నాయకులు దేవయ్య, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువ వైద్యురాలి మృతికి కారణమైన డాక్టర్ అరెస్ట్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, జనవరి 5: సిద్దిపేట ప్రభుత్వ వైద్య కళాశాలలో హౌస్ సర్జన్‌గా పనిచేస్తున్న యువ వైద్యురాలు బి. లావణ్య (23) మృతి ఘటనలో కీలక మలుపు చోటు చేసుకుంది. ప్రేమ పేరుతో మోసం చేసి ఆమె మృతికి కారణమైన సీనియర్ డాక్టర్ ప్రణయ్ తేజ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. జోగులాంబ గద్వాల జిల్లా మానోపాడు మండలం జల్లాపురం గ్రామానికి చెందిన లావణ్య పేద దళిత కుటుంబానికి చెందినవారు. ప్రభుత్వ సాంఘిక సంక్షేమ పాఠశాలలో చదివి, 2020లో మొదటి ప్రయత్నంలోనే సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్‌లో చేరారు. ప్రస్తుతం అక్కడే ఇంటర్న్‌షిప్ చేస్తున్నారు.అదే కళాశాలలో సీనియర్ రెసిడెంట్‌గా పనిచేస్తున్న సికింద్రాబాద్ ఆల్వాలకు చెందిన డాక్టర్ ప్రణయ్ తేజ్ తో గత ఏడాది జూలైలో పరిచయం ఏర్పడి, అది ప్రేమ సంబంధంగా మారింది. వివాహం చేస్తానని నమ్మించిన ప్రణయ్ తేజ్, అనంతరం కుల భేదాన్ని కారణంగా చూపుతూ వివాహానికి నిరాకరించడంతో లావణ్య తీవ్ర మనోవేదనకు గురయ్యారు.జనవరి 3న హాస్టల్ గదిలో అపస్మారక స్థితిలో కనిపించిన లావణ్యను సహచరులు వెంటనే ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ జనవరి 4న తెల్లవారుజామున హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో మృతి చెందారు.ఈ ఘటనపై మృతురాలి అక్క శిరీష ఫిర్యాదు మేరకు సిద్దిపేట త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి నిందితుడు ప్రణయ్ తేజ్‌ను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు బీసీ కంసాలి కులానికి చెందినవాడని, మృతురాలు దళిత వర్గానికి చెందినదని నిర్ధారణ కావడంతో, బీఎన్ఎస్ సెక్షన్లు 108, 69తో పాటు ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిద్దిపేట ఏసీపీ ఎం. రవీందర్ రెడ్డి తెలిపారు.

ప్రైవేట్ ఫైనాన్స్ వేధింపులతో తాళలేక పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రతిపక్షం, మెదక్ టౌన్, జనవరి 5: ప్రైవేట్ ఫైనాన్స్ వేధింపులు తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మెదక్ పట్టణం రాంనగర్ లో చోటుచేసుకుంది. మెదక్ మండల పరిధిలోని మక్తా భూపతిపూర్ గ్రామానికి చెందిన చిటికెల అశోక్ మెదక్ పట్టణం రామ్ నగర్ లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అధిక వడ్డీకి డబ్బులు ఇచ్చిన ప్రైవేట్ ఫైనాన్స్ వ్యక్తుల వేధింపులు మరియు బలవంతంగా అతడి కారును తీసుకుపోవడమే ఈ ఘటనకు కారణమని తెలుస్తుంది. అయితే ఈ చర్యల వల్ల అశోక్ తీవ్ర మానసిక ఒత్తిడికి గురై, ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని ఈ విషయాన్ని స్థానికులు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అశోక్‌ను చికిత్స నిమిత్తం మెదక్ జిల్లా ప్రభుత్వ జనరల్



ఆసుపత్రికి తరలించగా, ప్రస్తుతం అతడి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు పోలీసులకు పిర్యాదు చేయనున్నట్టు తెలిపారు.





గ్రామ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ ఏకైక లక్ష్యం

- మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు
- జిల్లా ఫోరం అధ్యక్షులుగా గోపాలరెడ్డి ప్రమాణ స్వీకారం

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, జనవరి 5: రాష్ట్ర ప్రభుత్వం సర్పంచులకు అండగా ఉంటుందని, గ్రామ అభివృద్ధి కేవలం కాంగ్రెస్ తో సాధ్యమని మెదక్ మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మైనంపల్లి హనుమంతరావు అన్నారు. సోమవారం మెదక్ జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర గార్డెన్ లో సర్పంచ్ల ఫోరం జిల్లా అధ్యక్షుడిగా రావుల గోపాల్ రెడ్డి ప్రమాణ స్వీకారం సన్మాన కార్యక్రమానికి గ్రంథాలయ చైర్మన్ సువాసిని రెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ తో కలిసి రావుల గోపాల్ రెడ్డి ని ఘనంగా సన్మానించారు. ఏ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. కాంగ్రెస్ పార్టీ గ్రామ పంచాయితీలను అభివృద్ధి చేయడంలో ముందు ఉంటారని ముఖ్యమంత్రి మేజర్ గ్రామపంచాయతీలకు పది లక్షలు చిన్న గ్రామపంచాయతీలకు ఐదు లక్షల రూపాయల ఇవ్వడం జరుగుతుందని మైనంపల్లి తెలిపారు ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అంజనేయులు గౌడ్. జిల్లా గ్రంథాలయ చైర్మన్ సువాసిని రెడ్డి మాట్లాడుతూ. కాంగ్రెస్ పార్టీ గ్రామాలను అభివృద్ధి చేయడం కోసం కృషి చేస్తుందని గ్రామ సర్పంచులు ప్రజలకు సేవ చేయాలని ఐదు సంవత్సరాల పాటు ఆ గ్రామానికి అన్ని రంగాలలో ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత సర్పంచులదని సర్పంచులందరూ ఐక్యంగా ఉండి గ్రామ అభివృద్ధిల కోసం పని చేయాలని వారు తెలిపారు కేంద్ర ప్రభుత్వం గ్రామాలలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని తీసివేయడం జరిగిందని వెంటనే. సర్పంచులందరూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవోను వెంటనే రద్దుచేసి మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి పథకాన్ని అమలు చేయవలసిందిగా పోరాటం చేయవలసిన అవసరం ఉందని వారు తెలిపారు. రాష్ట్ర సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు మల్లేశం యాదవ్. వ్యవస్థాపక అధ్యక్షులు వెంకటేశం మాట్లాడుతూ. గత పాలనలో సర్పంచులకు నిధులు రాకపోవడంతో అనేక కష్టాలు పడ్డారని దీంతో ఆర్థికంగా చాలా నష్టం జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వం సర్పంచ్లను నష్టపరచదని వారు తెలిపారు సర్పంచులకు గ్రామంలోని ప్రజలు మంచి అవకాశాన్ని ఇచ్చిందని ఐదు సంవత్సరాల పాటు గ్రామ అభివృద్ధికి తోడ్పడుతూ గ్రామ ప్రజలకు ఎలాంటి కష్టాలు లేకుండా చూడాలని వారు తెలిపారు ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గతంలో సర్పంచుల మీద ఎమ్మెల్యేల పెత్తనం ఉండేదని ఎమ్మెల్యేలు చెప్తే కచ్చితంగా వినాల్సి అవసరం ఉండేదని నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో అలాంటి పరిస్థితి లేదని ఎమ్మెల్యేలు కూడా సర్పంచులదే ఫైనల్ గా అభివృద్ధి విషయంలో సహకరించడం జరుగుతుందని తెలిపారు ప్రతి గ్రామ సర్పంచ్ ఫోరం సభ్యత్వం తీసుకోవాలని సర్పంచ్లందరూ కలిసి ఇన్సూరెన్స్ ఏర్పాటు చేసుకోవాలని గతంలో ఆకస్మికంగా సర్పంచులు చనిపోతే ఇన్సూరెన్స్ ఎంతో ఉపయోగపడ్డాదని వారు తెలిపారు మెదక్ జిల్లాలో సర్పంచుల ఫోరం అని చెప్పుకుంటూ నా కొంత మంది సర్పంచులు నమ్మవద్దని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ల ఫోరం జిల్లా అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి. చిన్న శంకరంపేట మాజీ సర్పంచ్ రాజ్ రెడ్డి కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు సుప్రభాతరావు అమర్సేనారెడ్డి కిసాన్ సేవాదళ్ నాయకుడు ప్రభాకర్ రెడ్డి రమేష్ మాజీ కౌన్సిలర్ మధుసూదన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పరశురామ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు మెదక్ జిల్లా సర్పంచ్ ఫోరం న్యాయవాది కిరణ్ కుమార్ గౌడ్ ఎన్నికయ్యారు జిల్లా ప్రధాన కార్యదర్శిగా అక్బర్ ఎన్నిక కావడం జరిగింది ఈ కార్యక్రమంలో సర్పంచులు ఉపసర్పంచ్లు వార్డ్ మెంబర్లు పాల్గొన్నారు

సర్పంచ్ల ఫోరం అధ్యక్షుని సన్మానించిన జర్నలిస్టులు

మెదక్ జిల్లా సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడిగా రావుల గోపాల్ రెడ్డి ప్రమాణ స్వీకారం అనంతరం మెదక్ జర్నలిస్టులు ఎలక్ట్రానిక్ ప్రింట్ జర్నలిస్టులు గోపాల్ రెడ్డి ని ఘనంగా సన్మానించారు. ప్రజా సేవా కార్యక్రమంలో ముందుండే గోపాల్ రెడ్డి. స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని శంకరంపేట మాజీ ఎంపీపీగా . కాంగ్రెస్ సీనియర్ నాయకుడిగా. నేడు గ్రామ సర్పంచిగా ఎన్నికై జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా ఎన్నికైన గోపాల్ రెడ్డిని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయు) ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నాగరాజ్ సీనియర్ జర్నలిస్టులు రాజశేఖర్ రాజా గౌడ్ శ్రీనివాసచారి ఫారూఖ్ భాయ్ సుధాకర్ శ్రీనివాస్ గిరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోపాల్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ అందజేత

ప్రతిపక్షం, దౌల్తాబాద్, జనవరి 5 : విద్యార్థినీ విద్యార్థులు ప్రణాళికతో చదివి 10 ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించాలని గ్రామ సర్పంచ్ బండారు లాలు అన్నారు. సోమవారం దౌల్తాబాద్ మండల మాజీ జెడ్పిటిసి రణం జ్యోతి శ్రీనివాస్ గౌడ్ పెళ్లి రోజు సందర్భంగా మండల పరిధిలోని తిర్మలాపూర్ జడ్పీ పాఠశాల 10వ తరగతి విద్యార్థిని విద్యార్థులకు గ్రామ సర్పంచ్ బండారు లాలు, ఉప సర్పంచ్ గడ్డం నాగరాజు, మాజీ ఎంపిటిసి దేవేందర్ చేతుల మీదుగా విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మారవుని రమేష్‌గౌడ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల ప్రతిభ

ప్రతిపక్షం,మెదక్ టౌన్, జనవరి 5: కెనడా నుడి వెలువడుతున్న గడుగ్గాయి మాసపత్రిక నిర్వహించిన కథల పోటీలలో మెదక్ జిల్లా హవేళి ఘణపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా విద్యార్థులు ప్రతిప కనపరచినట్లు ప్రధానోపాధ్యాయులు కరుణాకర్ తిలిపారు.10 వ తరగతి చదువుతున్న విద్యార్థిని గొల్ల.నవ్య, 8 తరగతి విద్యార్థిని భీమరి. స్రవంతి రాసిన కథలు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం సంతోషమన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులను ప్రధానోపాధ్యాయులతో పాటు తెలుగు ఉపాధ్యాయులు ఉండ్రాళ్ళ రాజేశం అభినందించారు.



సిద్దిపేట జిల్లా రైతు రక్షణ సమితి జిల్లా క్యాలెండర్ జిల్లా కలెక్టర్ హైమావతి సోమవారం ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో రైతు రక్షణ సమితి ప్రతినిదులు,రైతు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రతిపక్షం, సిద్దిపేట



మల్లన్న స్వామి ఆశీస్సులు మెదక్ ప్రజలపై ఎల్లపుడు ఉండాలి

- మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, డిసెంబర్ 5: పట్టణ ప్రజలు సుభిక్షంగా ఉండాలని, సిరిసంపదలతో వర్ధిల్లాలని కోరుకోవడం జరిగిందని మెదక్ మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున గౌడ్ తెలిపారు. సోమవారం పట్టణంలోని నవపేట్ లో మల్లన్న స్వామి కళ్యాణ మహోత్సవం కన్నులపండుగగా జరిగింది. ఈ సందర్భంగా మాజీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్ హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికి అయినను ఘనంగా సన్మానించారు . అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు ఎల్లప్ప స్థానిక నాయకులు తుమ్మల లక్ష్మీ నారాయణ, నంగి పవన్, తలారి సంతోష్, శివ తదితరులు పాల్గొన్నారు.

అబద్ధాలతో కాలం వెల్లదీస్తున్న హరీశ్ రావు

- కాళేశ్వరం ,పాలమూరు ప్రాజెక్టుల్లో అవినీతిని కప్పిపుచ్చుకునేందుకే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ డ్రామా
- నియోజకవర్గ అభివృద్ధిని గాలికి వదిలేసి,రాజకీయాలు చేస్తున్న హరీష్ రావు
- డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజ్



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, జనవరి 5: గడిచిన రెండేండ్లలో అసెంబ్లీ సమావేశాల్లో ఏ ఒక్కరోజు కూడా సిద్దిపేట నియోజకవర్గంలో ఉన్న సమస్యలపై మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడకుండా ,కేవలం ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తూ రాజకీయ పబ్బం గడుపుకుంటూ కాలమా ఎల్లదీస్తున్నారని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజ్ యాదవ్ అన్నారు. సోమవారం సిద్దిపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో అయన మాట్లాడుతూ... హరీష్‌రావుకు చిత్తశుద్ధి ఉంటే నియోజకవర్గ అభివృద్ధిపై మాట్లాడాలని ,అంతే కాకుండా ప్రాజెక్టుల్లో భూములు కోలిపోయి ,రైతులకు డబ్బులు ఇవ్వకుండా గత ప్రభుత్వంలో ఇబ్బందులకు గురిచేసిన వారికీ డబ్బులు వెంటనే ఇప్పించే విదంగా కృషిచేయాలని, ప్రాజెక్టు లనుండి పంట పొలాలకు నీరొచ్చే విదంగా కాలువలు తవ్వుటకు కృషి చేయాలనీ హితువు పలికారు .కాళేశ్వరం ప్రాజెక్ట్ లో ,పాలమూరు ప్రాజెక్టు లో చేసిన అవినీతిని కప్పిపుచ్చుకోవడానికే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ లో హరీష్ రావు ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తూ ,సీఎం రేవంత్ రెడ్డిపై పచ్చి అబద్దాలు మాట్లాడారని మండిపడ్డారు. బిఆర్ఎస్ మునుగుతున్న నావ అని ,ప్రభుత్వంపై కానీ ,సీఎం రేవంత్ రెడ్డిపై హరీష్ రావు ఎన్ని అబద్దాలు చెప్పిన ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని అన్నారు .త్వరలో కాళేశ్వరం ప్రాజెక్టులో చేసిన అవినీతిలో, ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీష్ జైలుకు వెళ్లడం కాయం అన్నారు .కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ అని ,అన్ని వర్గాల అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి కృషిచేస్తున్నారన్నారు .సీఎం రేవంత్ రెడ్డిపై అసత్య ఆరోపణలు ,అవాక్కులు, చెవాక్కులు చేస్తే చూస్తూ ఊరుకోమని, నియోజకవర్గంలో తిరుగనియమని నాగరాజు హెచ్చరించారు .ఈ కార్యక్రమంలోనాయకులూ కల్లూరి నర్సింలు ,రెడ్డి మహేందర్ రెడ్డి ,మీసం రాజు ,బర్ల స్వామి , రాజు , కిషన్ ,సురేష్ తదితరులు పాల్గొన్నారు.



వెనిజులా చీఫ్ మదురోను అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నాం. ఏ దేశమూ ప్రపంచానికి పోలీసు, న్యాయమూర్తి కాలేదు. అన్నిదేశాలు ఇతర దేశ ప్రజలు ఎన్నుకున్న అభివృద్ధి మార్గాలను గౌరవించాలి. అంతర్జాతీయచట్టానికి, యూఎన్ సూత్రాలకు కట్టుబడి ఉండాలి. బల ప్రయోగాన్ని, బెదిరింపులను చైనా వ్యతిరేకిస్తుంది.

- జిన్‌పింగ్, చైనా అధ్యక్షుడు

విశ్వ వీక్షణం

సముద్ర ప్రతాప్ నౌక జలప్రవేశం

- హాజరైన రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్



ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, జనవరి 5: భారతీయ కోస్టు గార్డుకు చెందిన సముద్ర ప్రతాప్నౌక సోమవారం జలప్రవేశం చేసింది. గోవాలో జరిగిన కార్యక్రమంలో రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ పాల్గొన్నారు. సముద్ర ప్రతాప్‌ను పొల్యూషన్ కంట్రోల్ వెసల్‌గా వర్ణిస్తున్నారు. ఈ నౌకను స్వదేశీయంగా తయారు చేశారు. నౌకా నిర్మాణం, మారిటైం సామర్థ్యం కలిగిన దేశాల్లో భారత్ ఓ కీలక అడుగు వేసింది. సముద్ర ప్రతాప్ నౌకను గోవా షిప్‌యార్డు సంస్థ నిర్మించింది. సుమారు 60 శాతం స్వదేశీ పరిజ్ఞానంతో సముద్ర ప్రతాప్‌ను తయారు చేశారు. ఇండియన్ కోస్టు గార్డు వద్ద ఉన్న నౌకల్లో సముద్ర ప్రతాప్ అతిపెద్ద నౌకగా గుర్తింపు తెచ్చుకున్నది. మారిటైం పొల్యూషన్, ఫైర్ ఫైటింగ్, సముద్ర , పర్యావరణ రక్షణతో పాటు కోస్తా తీర ప్రాంతాల్లో పెట్రోలింగ్ నిర్వహించనున్నది. మారిటైం సవాళ్లను ఎదుర్కొనే రీతిలో సముద్ర ప్రతాప్ యుద్ధనౌకను తయారు చేసినట్లు మంత్రి రాజ్ నాథ్ సింగ్ తెలిపారు. స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసే నౌకల్లో 90 శాతం స్వంత వస్తువులను వాడే రీతిలో ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఆయన చెప్పారు. సముద్రాలు స్వచ్ఛంగా ఉంటే, వాణిజ్యం సురక్షితంగా సాగుతుందన్నారు. ఇండోపసిఫిక్ ప్రాంతంలో శాంతియుత, స్థిరమైన మారిటైం ఎన్విరాన్మెంట్ కోసం పాటుపడుతున్నట్లు చెప్పారు. సుముద్ర ప్రతాప్ నౌక సుమారు 114.5 మీటర్ల పొడుగు ఉంటుంది.4200 టన్నులు బరువు ఉన్నది. సుమారు 22 నాట్ల వేగంతో ఇది ప్రయాణిస్తుంది.



వెనిజులా ఆపరేషన్‌లో 80 మంది మృతులు

వెనిజులా దేశాధ్యక్షుడు నికొలస్ మదురోను అమెరికా నిర్బంధించిన విషయం తెలిసిందే. ఆ ఆపరేషన్‌లో ఇప్పటి వరకు మృతిచెందిన వారి సంఖ్య 80కి చేరుకున్నది. మృతుల్లో సైనికులు, సాధారణ పౌరులు కూడా ఉన్నట్లు అమెరికాకు చెందిన న్యూయార్క్ టైమ్స్ పత్రిక పేర్కొన్నది. మదురోకు చెందిన భద్రతా దళంలో చాలా మందిని అమెరికా సైన్యం చంపేసినట్లు వెనిజులా రక్షణ మంత్రి వ్లాదిమిర్ పద్రినో లోపేజ్ తెలిపారు. అయితే ఆ ఆపరేషన్‌లో ఎంత మంది మరణించారన్న విషయాన్ని స్పష్టంగా చెప్పలేదు. సాధారణ పౌరులను అమెరికా టార్గెట్ చేసినట్లు చెబుతున్న వెనిజులా అధికారులు డెత్‌కౌంట్ మాత్రం అధికారికంగా వెల్లడించడం లేదు. మరో వైపు ఆ ఆపరేషన్ సమయంలో 32 మంది తమ పౌరులు చనిపోయినట్లు క్యూబా అధికారులు చెప్పారు. దీంట్లో సైనిక సిబ్బంది కూడా ఉన్నది. అటాక్‌లో వాళ్లు ప్రాణాలు కోల్పోయారు. జనవరి అయిదు, ఆరో తేదీల్లో జాతీయ సంతాప దినాలు పాటించనున్నట్లు క్యూబా అధ్యక్షుడు మిగుల్ డియాజ్ కెనాల్ తెలిపారు. మదురోను పట్టుకునే సమయంలో జరిగిన అటాక్‌లో ప్రాణాలు కోల్పోయిన వారికి వెనిజులా విదేశాంగ మంత్రి యువాన్ గిల్ పింటో నివాళి అర్పించారు. తమ బాధ్యతలను నిర్వర్తించే క్రమంలో ప్రాణాలు కోల్పోయినట్లు చెప్పారు. అమెరికా నేరపూరితమైన దాడికి పాల్పడినట్లు మంత్రి ఆరోపించారు. మదురో నిర్బంధ ఆపరేషన్‌లో అమెరికా సైనికులు ఎవరూ మరణించలేదని అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. అయితే కొంత మంది సిబ్బంది గాయపడి ఉంటారని ఆయన చెప్పారు. మదురో, ఆయన భార్యను పట్టుకునే సమయంలో అరడజను మంది సైనికులు గాయపడినట్లు ఇద్దరు అమెరికా అధికారులు వెల్లడించారు. అమెరికా తన అటాక్ సమయంలోనే అనేక సైనిక కేంద్రాలను టార్గెట్ చేసినట్లు తెలుస్తోంది. కమ్యూనికేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, డిపోలను పేల్చివేశారు. డ్రగ్ ట్రాఫికింగ్, ఆయుధాల ఆరోపణలపై మదురోను అమెరికా పట్టుకున్నది. కానీ వెనిజులా నాయకత్వం మాత్రం డ్రగ్ వ్యాపారంతో సంబంధం లేదని చెబుతోంది.

పీవోకే సహా జమ్మూ కశ్మీర్‌ను భారత్‌లో విలీనం చేయాలి

- బ్రిటన్ ఎంపీ బాబ్ బ్లాక్‌మన్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, జనవరి 5: జమ్మూకశ్మీర్ పై బ్రిటన్ ఎంపీ బాబ్ బ్లాక్‌మన్ కీలక వ్యాఖ్యలు చేశారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ తో సహా జమ్మూకశ్మీర్ మొత్తాన్ని భారత్‌లో విలీనం చేయాలని అన్నారు. ఆర్టికల్ 370ని రద్దు చేయాలని తాను మూడు దశాబ్దాల క్రితమే చెప్పానని, ఆ పని 1992లో కశ్మీర్ పండిట్ల వలసల కన్నా ముందే చేపట్టాల్సిందని అభిప్రాయం వ్యక్తం చేశారు. జైపూర్‌లో సోమవారం నాడు జరిగిన హైటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, 1990 మొదట్లో కశ్మీర్ పండిట్లు వలసలు వెళ్తున్నప్పుడే తన వైఖరిని స్పష్టం చేసినట్టు చెప్పారు.



'ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 370వ అధికరణను రద్దు చేస్తామని మేనిఫెస్టోలో పెట్టి అమలు చేయడానికి చాలాకాలం ముందే 1992లో నేను ఈ విషయం ప్రస్తావించాను. కశ్మీర్ పండిట్లకు తీవ్రం అన్యాయం జరుగుతోందంటూ యూకేలో ఒక సమావేశం కూడా నిర్వహించాం. మతం, ఇతర కారణాలతో కశ్మీర్ పండిట్లు తమ పూర్వీకుల ఇళ్లు బలవంతంగా వదిలివెళ్లాల్సి రావడాన్ని ఖండించాం' అని బ్లాక్‌మన్ తెలిపారు. జమ్మూ కశ్మీర్‌లోని ప్రాంతాలను బలవంతంగా ఆక్రమించుకోవడం, పీఓకే ప్రాంతంలో పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని విస్తరించడం సరైన చర్య కాదని, ఈ విషయం తాను పదేపదే చెబుతూ వచ్చానని ఆయన అన్నారు. జమ్మూకశ్మీర్ మొత్తాన్ని భారత్‌లో విలీనం చేయాలనీ తాను అనేకసార్లు సూచించానని చెప్పారు. పహల్గాం ఉగ్రదాడిని కూడా బ్లాక్‌మన్ ఖండించారు. ఈ దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోవడంపై విచారం వ్యక్తం చేశారు. కొన్నేళ్లుగా జమ్మూకశ్మీర్‌లో పరిస్థితులు మెరుగుపడటంతో అక్కడ శాంతి నెలకొందని తాము భావించినప్పటికీ పహల్గాం దాడితో ఉగ్రసమస్య మళ్లీ వెలుగులోకి వచ్చిందన్నారు. ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు ప్రపంచ దేశాలు బాసటగా నిలబడటం ముఖ్యమని చెప్పారు.



ట్రంప్ ప్రపంచ జనాభాను భయపెట్టేందుకు యత్నిస్తున్నాడు

- మోదీ ఎందుకు ట్రంప్‌ముందు బెండ్‌అవుతున్నారు
- మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, జనవరి 5: వెనెజువెలా లో నెలకొన్న పరిస్థితి ఈ ప్రపంచానికి మంచిది కాదని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ప్రపంచంలోని జనాభాను భయపెట్టే ప్రయత్నం చేస్తున్నాడని విమర్శించారు. ఎవరు రాజ్య విస్తరణకు ప్రయత్నించినా దాన్ని ఎక్కువ కాలం కొనసాగించలేరని ఖర్గే అన్నారు. హిట్లర్, ముస్సోలినీ లాంటి వాళ్లు కూడా అలాంటి ప్రయత్నాలు చేసి కనుమరుగై పోయారని చెప్పారు. కొంతమంది కుటిల ఆలోచనలతో ప్రపంచ శాంతిని చెడగొట్టేందుకు ప్రయత్నించడం మంచిది కాదని అన్నారు. భారత్‌పాకిస్థాన్ దేశాల మధ్య శాంతిని నెలకొల్పడంలో తాను కీలక పాత్ర పోషించానని ట్రంప్ ఎప్పుడూ చెబుతుంటాడని, ఇప్పటివరకు దాదాపు 70 సార్లు ఈ విషయం చెప్పాడని తెలిపారు. ఈ ప్రపంచంలో తానే అత్యంత గొప్ప వ్యక్తినని, ఈ ప్రపంచం తనముందు మోకరిల్లుతుందనేది ట్రంప్ మాటలకు అర్థమని ఖర్గే చెప్పారు. కానీ ట్రంప్ ముందు మోకారిల్లాల్సిన అవసరం ఈ ప్రపంచానికి లేదని అన్నారు. మనం ప్రజాస్వామ్యంలో జీవిస్తున్నామని, ప్రజాస్వామ్య పద్ధతిలోనే ముందుకు పోతామని వ్యాఖ్యానించారు. 'బతుకు, బతుకనివ్వు' అనేది నెహ్రూ పాలసీ అని, అదే మా పాలసీ కూడా అని చెప్పారు. ఇవాళ ట్రంప్ మాట్లాడిన ఒక ఆడియో విన్నానని, 'మోదీకి నేనంటే గౌరవమని, నా మాట వింటాడని నాకు తెలుసు' అన్నది ఆ ఆడియో సారాంశమని ఖర్గే అన్నారు. అంటే మోదీ తన కంట్రోల్‌లో ఉన్నాడనేది దీని అర్థమా..? అని ఆయన ప్రశ్నించారు. మోదీ ఎందుకు ట్రంప్ ముందు బెండ్ అవుతున్నాడో తనకు అర్థం కావడం లేదని అన్నారు. ఇది దేశానికి ప్రమాదకరమని చెప్పారు. నిన్ను ప్రజలు ప్రధానిగా ఎన్నుకున్నది ట్రంప్ చెప్పినట్లు తలూపడానికి కాదని అన్నారు.



స్కీయింగ్ మంచులో భలే మజా!!

చలికాలం సీజన్‌లో అనేక పర్వత ప్రాంతాల్లో మంచు కురుస్తోంది. స్కీయింగ్‌ను ఇష్టపడే వ్యక్తులకు ఇది చాలా ఉత్తేజకరమైన సమయం. స్కీయింగ్‌కు అనువైన 5 ప్రదేశాల గురించి ఇక్కడ మేము మీకు చెప్పబోతున్నాము. మీరు ఈ ప్రదేశాలలో మరిన్ని సాహసోపేతమైన కార్యకలాపాలను చేయవచ్చు. శీతాకాలం వచ్చిన వెంటనే, ప్రజలు పర్వతాలను సందర్శించడానికి ప్రణాళికలు వేస్తారు. హిమపాతాన్ని ఆస్వాదించడానికి ఇదే సరైన సమయం. ప్రస్తుతం, కాశ్మీర్, నైనిటాల్ (హిమపాతం గమ్యస్థానాలు భారతదేశం) వంటి అనేక ప్రదేశాలలో హిమపాతం ఉంది, ఆ తర్వాత ఈ ప్రదేశాలలో పర్యాటకుల వరద ఉంది. స్కీయింగ్ ప్రియులకు ఇది చాలా మంచి సమయం. మీరు కూడా మంచు మీద జారిపడి పర్వతాల అందాలను ఆస్వాదించాలనుకుంటే, భారతదేశంలో స్కీయింగ్ చేయడానికి చాలా గొప్ప ప్రదేశాలు ఉన్నాయి. భారతదేశంలో స్కీయింగ్ కోసం 5 ఉత్తమ ప్రదేశాల గురించి తెలుసుకుందాం.

ఔలి, ఉత్తరాఖండ్

ఇది ఎందుకు ప్రత్యేకం ఔలి గర్వాల్ హిమాలయాల్లో ఉంది. నందా దేవి మరియు మన పర్వతం యొక్క అద్భుతమైన వీక్షణలతో, ఔలిలో అనేక స్కీయింగ్ వాలులు ఉన్నాయి, ఇవి ప్రారంభ మరియు అనుభవజ్ఞులైన స్కీయర్‌లకు సరిపోతాయి. ఏమి చేయాలి ఇక్కడ స్కీయింగ్‌తో పాటు ట్రెక్కింగ్, పారాగ్లైడింగ్ మరియు కేబుల్ కార్ రైడ్ కూడా చేయవచ్చు.

గుల్మార్గ్, కాశ్మీర్

ఇది ఎందుకు ప్రత్యేకం గుల్మార్గ్ ఆసియాలో అత్యుత్తమ స్కీయింగ్ గమ్యస్థానంగా పరిగణించబడుతుంది. ఇక్కడ మీరు వివిధ కష్టస్థాయిల వాలులను కనుగొంటారు. ఏమి చేయాలి స్కీయింగ్ కాకుండా, మీరు ఇక్కడ లోయను అన్వేషించవచ్చు మరియు షేర్‌ఎకశ్మీర్ నేషనల్ పార్క్‌లో వన్యప్రాణులను కూడా చూడవచ్చు.

సోలాంగ్ వ్యాలీ, హిమాచల్ ప్రదేశ్

ఇది ఎందుకు ప్రత్యేకం మనాలి సమీపంలో ఉన్న సోలాంగ్ వ్యాలీ స్కీయింగ్ మరియు ఇతర సాహస క్రీడలకు ప్రసిద్ధి చెందిన ప్రదేశం. ఇక్కడ మీరు మంచు మీద చేసిన స్నోమెన్ మరియు స్నోబాల్ ఫైట్‌లను కూడా ఆస్వాదించవచ్చు. ఏమి చేయాలి స్కీయింగ్‌తో పాటు, మీరు ఇక్కడ పారాగ్లైడింగ్, జిప్‌లైనింగ్ మరియు స్నో మొబైలింగ్ కూడా చేయవచ్చు.

నరకంద, హిమాచల్ ప్రదేశ్

ఇది ఎందుకు ప్రత్యేకం సిమ్లా సమీపంలో ఉన్న నరకంద ప్రశాంతమైన మరియు అందమైన హిల్ స్టేషన్. ఇక్కడ మీరు ప్రశాంతమైన వాతావరణంలో స్కీయింగ్‌ని ఆనందిస్తారు. ఏమి చేయాలి స్కీయింగ్‌తో పాటు, మీరు ట్రెక్కింగ్‌కు వెళ్లి ఇక్కడ స్థానిక మార్కెట్‌లను సందర్శించవచ్చు.

కుఫ్రి, హిమాచల్ ప్రదేశ్

ఇది ఎందుకు ప్రత్యేకం కుఫ్రి అనేది సిమ్లా సమీపంలోని ఒక చిన్న హిల్ స్టేషన్, ఇది స్కీయింగ్ మరియు ఇతర చలికాలపు కార్యకలాపాలకు ప్రసిద్ధి.
ఏమి చేయాలి స్కీయింగ్ కాకుండా, మీరు గుర్రపు స్వారీ మరియు స్థానిక సంస్కృతిని ఇక్కడ అనుభవించవచ్చు.

స్కీయింగ్ కోసం ఎలా సిద్ధం కావాలి?

- **దుస్తులు- వెచ్చని బట్టలు, చేతి తొడుగులు, టోపీ మరియు స్కీ బూట్లు తీసుకోవాలి**
- **భద్రతా సామగ్రి- హెల్మెట్ మరియు గాగుల్స్ ధరించడం మర్చిపోవద్దు**
- **శిక్షకుడు- మీరు మొదటిసారి స్కీయింగ్ చేస్తుంటే, శిక్షకుడి పర్యవేక్షణలో చేయండి**
- **ఆరోగ్యం - స్కీయింగ్ అనేది శారీరకంగా అలసిపోయే పని, కాబట్టి బాగా సిద్ధంగా ఉండండి**













ఐపీఎల్‌పై 'బంగ్లా' నిషేధం

భారత్, బంగ్లాదేశ్ మధ్య క్రికెట్ సంబంధాలు మరింత ముదిరి పాకాన పడుతున్నాయి. ఇరు దేశాల నడుమ కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు క్రికెట్‌పై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. మైనార్టీ హిందువులను లక్ష్యంగా చేసుకుంటున్న బంగ్లాదేశ్ వైఖరిని నిరసిస్తూ ఆ దేశ క్రికెటర్ ముస్తాఫిజర్ రెహమాన్‌ను బీసీసీఐ తొలిగించడం ఆ తర్వాత బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు(బీసీబీ) నిర్ణయాలు వివాదాన్ని మరింత రాజేస్తున్నాయి. తమ దేశ క్రికెటర్‌ను ఐపీఎల్ నుంచి తీసివేయడాన్ని ఏ మాత్రం జీర్ణించుకోలేకపోతున్న బంగ్లాదేశ్ ఇప్పటికే భారత్‌లో జరిగే టీ20 ప్రపంచకప్‌లో ఆడేది లేదంటూ ప్రకటన జారీ చేయగా, తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. తమ దేశంలో ఐపీఎల్ ప్రసారాలపై నిషేధం విధిస్తున్నట్లు బంగ్లా తాత్కాలిక ప్రభుత్వంలోని ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్ శాఖ సోమవారం అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు మంత్రిత్వ శాఖ సహాయక కార్యదర్శి ఫిరోజ్ ఖాన్ ఒక ప్రకటన ద్వారా ఈ విషయాన్ని వెల్లడించారు. 'ముస్తాఫిజుర్ రెహమాన్‌ను ఐపీఎల్ నుంచి తీసివేయడంపై బీసీసీఐ సరైన కారణం చెప్పలేదు. బీసీసీఐ తీసుకున్న ఈ నిర్ణయం బంగ్లా ప్రజలను బాధించింది. మా దేశ ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకుంటున్నాం. తదుపరి ఆదేశాలు ఇచ్చేంత వరకు ఐపీఎల్ ప్రసారాలపై బ్యాన్ కొనసాగుతుంది' అని బంగ్లా ప్రభుత్వం పేర్కొంది. ఐపీఎల్ ప్రసారాలపై బంగ్లాదేశ్ విధించిన నిషేధంతో బీసీసీఐకి వచ్చిన నష్టమేమి లేదు. ప్రపంచంలోనే అత్యంత ధనిక లీగ్‌గా వెలుగొందుతున్న ఐపీఎల్‌కు విపరీతమైన ప్రజాదరణ ఉంది. బంగ్లా లాంటి దేశాలు బహిష్కరించినా బీసీసీఐకి ఆర్థికంగా ఎలాంటి ఇబ్బందులు ఉండవని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.



వైభవ్ విధ్వంసం

పది సిక్సర్లతో దక్షిణాఫ్రికా బౌలర్ల వేట

భారత సంచలనం వైభవ్ సూర్యవంశీ కెప్టెన్‌గా మరింత రెచ్చిపోయి ఆడుతున్నాడు. దక్షిణాఫ్రికా అండర్ 19 బౌలర్లను వణికిస్తూ విధ్వంసక అర్ధ శతకం(68) బాదాడీ కుర్రాడు. రెండో యూత్ వన్డే లో ఆకాశమే హద్దుగా చెలరేగిన వైభవ్.. 10 సిక్సర్లతో సఫారీ బౌలర్లను బెంబేలెత్తించాడు. అతడితో పాటు అభిగ్యాన్ కుందు (48నాటౌట్) మెరుపులతో భారీ స్కోర్ చేసిన టీమిండయా డక్‌వర్త్ లూయిస్ ప్రకారం 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. కొత్త ఏడాదిలోనూ వైభవ్ సూర్యవంశీ సుడిగాలి ఇన్నింగ్స్‌లు ఆడుతున్నాడు. దక్షిణాఫ్రికాతో యూత్ వన్డే సిరీస్‌లో సారథిగా వ్యవహరిస్తున్న వైభవ్.. రెండో మ్యాచ్‌లో శివాలెత్తిపోయాడు. ప్రత్యర్థి నిర్దేశించిన 246 పరుగుల ఛేదనలో ఈ లెఫ్ట్ హ్యాండర్ పూనకాలు వచ్చినట్టు బ్యాట్‌తో విధ్వంసం సృష్టించాడు. కేవలం 24 బంతులనే ఎదుర్కొన్న ఈ యంగ్ బ్యాటర్. 10 సిక్సర్లు, ఒక్క ఫోర్‌తో 68 రన్స్ బాదేశాడు. అతడు ఔటయ్యాక.. వేదాంత్ త్రివేది(31 నాటౌట్), అభిగ్యాన్ కుందు(48 నాటౌట్)లు అజేయంగా జట్టును గెలిపించారు. డక్‌వర్త్ లూయిస్ ప్రకారం టీమిండియా లక్ష్యాన్ని 176గా నిర్దేశించగా.. 8 వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. వైభవ్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. తొలి వన్డేలోనూ డీఎల్ఎస్ పద్ధతిలోనే 19 పరుగుల తేడాతో గెలిచిన భారత్ మూడు యూత్ వన్డేల సిరీస్‌లో 20తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఇరుజట్ల మధ్య చివరి మ్యాచ్ జనవరి 7న జరుగనుంది.



ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 384

హెడ్ వీరవిహారం, ఆసీస్ 166/2

ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ మధ్య యాషెస్ సిరీస్ ఐదో టెస్టు రసవత్తరంగా సాగుతున్నది. ఆస్ట్రేలియా ఓపెనర్ ట్రావిస్‌హెడ్(87 బంతుల్లో 91 నాటౌట్, 15ఫోర్లు) ధనాధన్ అర్ధసెంచరీతో విజృంభించాడు. ఇంగ్లండ్ బౌలర్లను ఉతికి ఆరేస్తూ పరుగుల వరద పారించాడు. టీ20లను తలపిస్తూ తక్కువ బంతుల్లోనే స్కోరుబోర్డుకు కీలక పరుగులు జతచేశాడు. ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 2 వికెట్లకు 166 పరుగులు చేసింది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 211/3తో రెండో రోజు సోమవారం బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 384 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాటర్ జోరూట్ (160) సూపర్ సెంచరీతో కదంతొక్కాడు.ఈ క్రమంలో టెస్టుల్లో 41వ సెంచరీ చేశాడు.



సూర్య మళ్లీ ఫామ్ అందుకుంటాడు

సూర్యకుమార్‌కు పాంటింగ్‌మద్దతు

సొంతగడ్డపై మరో 33 రోజుల్లో టీ20 ప్రపంచకప్. డిఫెండింగ్ ఛాంపియన్ భారత జట్టు బలమైన స్క్వాడ్‌తోనే బరిలోకి దిగనుంది. కానీ, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఫామ్ ఒక్కటే టీమిండియాను ఆందోళనకు గురి చేస్తోంది. ఆసియా కప్‌తో మొదలు.. ఆస్ట్రేలియా పర్యటన, దక్షిణాఫ్రికా సిరీస్‌లో తీవ్రంగా నిరాశపరిచాడు సూర్య. ఈ నేపథ్యంలో మిస్టర్ 360కి ఆసీస్ దిగ్గజం రికీ పాంటింగ్ మద్దతు పలికాడు. మళ్లీ సూర్య ఫామ్ అందుకుంటాడు. తనదైన స్టయిల్లో రెచ్చిపోతాడు అని పాంటింగ్ అంటున్నాడు. స్పోర్ట్స్ టీవీ ప్రజెంటర్ సంజనా గణేశన్ తో ఐసీసీ రివ్యూ ఇంటర్వ్యూలో పాంటింగ్ సోమవారం మాట్లాడుతూ భారత సారథికి బాసటగా నిలిచాడు. ఒకప్పుడు తన ట్రేడ్‌మార్క్ షాట్లతో బౌలర్లను భయపెట్టిన సూర్య టచ్ కోల్పోవడం తనకు ఆశ్చర్యం కలిగిస్తోందని అన్నాడు. 'ఈమధ్య సూర్యకుమార్ యాదవ్ ఆట నాకు పెద్ద సర్‌ప్రైజ్. పటిష్టమైన టెక్నిక్, నిలకడైన ఆటతో అతడు కొన్నాళ్లుగా టీమిండియాకు టీ20ల్లో ప్రధాన ఆయుధంగా ఉన్నాడు. కానీ, ఇప్పుడు ఫామ్‌లేమితో బాధపడుతున్నాడు. అతడు అద్భుతమైన క్రికెటర్. సూర్య గొప్ప క్రికెట్ ఆడడం చూశాను నేను. అప్పుడు అతడు 8, 10 బంతులాడాక తన స్టయిల్ విధ్వంసాన్ని కొనసాగించేవాడు. ట్రావిస్ హెడ్ మాదిరిగానే సూర్యకు కూడా భయం తెలియదు. ఔట్ అవుతానేమోనని అతడు రిస్కీ షాట్లు ఆడకుండా ఉండడు. అందుకుని భారత కెప్టెన్‌కు నా సలహా ఏంటంటే.. ఔట్ అవుతానేమోనని ఆలోచించకుండా పరుగులు సాధించడం మీద దృష్టి సారించాలి. నీపై నమ్మకంతో ఉండు. నిన్ను నువ్వు ప్రోత్సహించుకో. పొట్టి ఫార్మాట్లో అత్యుత్తమ ఆటగాడిగా నిరూపించుకున్నావు. మరోసారి నీ స్టయిల్ విధ్వంసంతో నేను బెస్ట్ అని చాటిచెప్పు' అని భారత కెప్టెన్‌కు పాంటింగ్ విలువైన సలహా ఇచ్చాడు. గత 19 ఇన్నింగ్స్‌ల్లో సూర్య 218 పరుగులతో తీవ్రంగా నిరాశపరిచాడు.



'వారెవా వారెవా..'

'లెనిన్' నుంచి లిరికల్ సాంగ్ రిలీజ్..

అఖిల్ అక్కినేని హీరోగా మనం ఎంటర్‌ప్రైజెస్ ఎల్ఎల్‌పి, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై మురళి కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తోన్న చిత్రం 'లెనిన్'. ఈ సినిమాను సోమవారం రోజున 'వారెవా వారెవా..' అనే లిరికల్ సాంగ్‌ను విడుదల చేవారు. ఈ పాటకు అభిమానులు, మ్యూజిక్ లవర్స్ నుంచి చాలా మంచి రెస్పాన్స్ వస్తోంది. ఈ పాటను అనంత శ్రీరామ్ రాయగా.. శ్వేతా మోహన్, జుబిన్ నౌటియాల్ తమ వాయిస్‌తో పాటకు ఓ ఎమోషనల్ ఫీల్‌ను తీసుకొచ్చారు.మ్యూజికల్ సెన్సేషనల్ ఎస్.ఎస్.తమన్ సంగీతం సారథ్యం వహిస్తోన్న ఈ చిత్రంలోని ఈ పాట రొమాంటిక్ ఫీల్‌ను కలిగిస్తోంది. సినిమాలోని భావోద్వేగాలను చక్కగా ప్రతిబింబిస్తూ, హీరో-హీరోయిన్ మధ్య కెమిస్ట్రీని హైలైట్ చేసేలా పాట ఉంది. దీంతో ఈ సినిమాపై ఉన్న అంచనాలు మరింత పెరిగాయి.



'మన శంకర వర ప్రసాద్ గారు'

ట్రైలర్‌కు 24 గంటల్లో రికార్డ్ వ్యూస్

మెగాస్టార్ చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి తెరకెక్కించిన చిత్రం 'మన శంకర వర ప్రసాద్ గారు'. యాక్షన్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందించిన ఈ మూవీ ట్రైలర్‌ను ఆదివారం నాడు రిలీజ్ చేశారు. ఇక ఈ ట్రైలర్ 24 గంటల్లోనే రికార్డ్ వ్యూస్ సాధించింది. 24 గంటల్లోనే 25 మిలియన్ల వ్యూస్‌ను క్రాస్ ఇప్పటికీ యూట్యూబ్‌లో టాప్‌లో ట్రెండ్ అవుతోంది. చిరంజీవి గత చిత్రాల నుంచి వచ్చిన ట్రైలర్‌లలో ఓ రేంజ్ రికార్డ్ వ్యూస్‌ను సాధించి టాప్‌లో దూసుకుపోతోంది 'మన శంకర వర ప్రసాద్ గారు' ట్రైలర్. ఇక అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఆ తరుణం వచ్చేసింది. జనవరి 7న హైదరాబాద్‌లో జరగనున్న 'మన శంకర వర ప్రసాద్ గారు' గ్రాండ్ ప్రీరిలీజ్ ఈవెంట్‌లో మెగాస్టార్ చిరంజీవి, విక్టరీ వెంకటేష్ సందడి చేయనున్నారు. మొదటి నుంచీ డిఫరెంట్ ప్రమోషన్స్‌తో టీం ఆకట్టుకుంటోన్న సంగతి తెలిసిందే. అయితే ఈ ప్రమోషన్స్‌లో మొదటి సారిగా చిరంజీవి, వెంకటేష్ కనిపించబోతోన్నారు. ఇది ఇటీవలి కాలంలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రీరిలీజ్ ఈవెంట్‌లలో ఒకటిగా నిలిచింది. ఈ లెజెండరీ స్టార్స్ చేసే సందడి, వారిద్దరి బంధాన్ని చూసేందుకు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ట్రైలర్‌తో ఒక్కసారిగా అంచనాలు పెంచేశారు దర్శకుడు అనిల్ రావిపూడి. కావాల్సినంత వినోదం, హాస్యం, మాస్ అప్పీల్‌తో నిండిన ఈ సినిమాలో చిరంజీవి, వెంకటేష్ కాంబో సీన్స్ హైలెట్ కానున్నాయని ట్రైలర్ చూస్తేనే తెలుస్తోంది. వీరి కాంబో గురించి ఇప్పటికే అందరూ మాట్లాడుకుంటున్న సంగతి తెలిసిందే. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై సాహు గారపాటి, సుష్మిత కొణిదెల నిర్మించిన ఈ చిత్రం జనవరి 12న గ్రాండ్ థియేట్రికల్ విడుదలకు సిద్ధంగా ఉంది.





హైదరాబాదులో 'భోగి'

చార్మింగ్ స్టార్ శర్వా, బ్లాక్ బస్టర్ మేకర్ సంపత్ నంది ప్రతిష్టాత్మక పాన్‌ఇండియా ప్రాజెక్ట్ భోగి. ఈ చిత్రాన్ని శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కెకె రాధామోహన్ నిర్మించారు. లక్ష్మి రాధామోహన్ సమర్పిస్తున్నారు. 1960 బ్యాక్ డ్రాప్ లో రూపొందుతున్న ఈ సినిమా గ్రేట్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించబోతోంది. ఈ చిత్రం టైటిల్ ఫస్ట్ స్పార్క్ అనే పవర్ ఫుల్ కాన్సెప్ట్ వీడియో అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమా కొత్త షూటింగ్ ఈరోజు హైదరాబాద్‌లో నిర్మించిన భారీ సెట్‌లో ప్రారంభమయ్యింది. ఈ కీలక షెడ్యూల్లో టాకీ పార్ట్ ని చిత్రీకరించనున్నారు. ఈ సినిమాలో శర్వా నెవర్ బిఫోర్ పాత్రలో కనిపించనున్నారు. అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. 1960ల ఉత్తర తెలంగాణమహారాష్ట్ర ప్రాంతంలో వింటేజ్ సెట్టింగ్ తో 'భోగి' టెక్నికల్ గా నెక్స్ట్ లెవల్ లో ఉండబోతోంది. ఈ చిత్రానికి స్టార్ కంపోజర్ భీమ్స్ మ్యూజిక్ అందిస్తున్నారు. డిఓపి కిషోర్ కుమార్, కిరణ్ కుమార్ మన్నె ఆర్ట్ డైరెక్టర్. భోగి తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది.

'భర్త మహాశయులకు విజ్ఞప్తి'

జనవరి 7న ట్రైలర్ విడుదల

మాస్ మహారాజా రవితేజ నుంచి వస్తోన్న ఫ్యామిలీ ఎంటర్టైనర్ మూవీ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. కిశోర్ తిరుమల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ మూవీని సుధాకర్ చెరుకూరి ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై నిర్మించారు. భీమ్స్ సిసిరోలియో అందించిన సంగీతం సినిమాపై మరింత హైప్ పెంచింది. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి ఒక అదిరిపోయే అప్‌డేట్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను జనవరి 7వ తేదీన గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతున్నట్లు ప్రకటించారు. రవితేజ మార్క్ ఎనర్జీకి, కిశోర్ తిరుమల క్లాస్ టచ్ తోడైతే ఎలా ఉంటుందో ఈ సినిమా అలా ఉండబోతోందని ఇండస్ట్రీ టాక్. సంక్రాంతి బరిలో వస్తున్న ఈ చిత్రం పక్కా ఫ్యామిలీ ఆడియన్స్‌ను టార్గెట్ చేస్తూ రూపొందింది. ఇప్పటికే విడుదలైన టీజర్ ప్రేక్షకుల్లో విపరీతమైన క్యూరియాసిటీని పెంచింది. ముఖ్యంగా రవితేజ ఇద్దరు భామల (ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతి) మధ్య నలిగిపోయే 'లవ్ ట్రయాంగిల్' సన్నివేశాలు నవ్వులు పూయించాయి. జనవరి 7న రాబోయే ట్రైలర్‌లో కథలోని అసలు ట్విస్టులేంటో, రవితేజ పండించే కామెడీ ఏ రేంజ్‌లో ఉండబోతోందో పూర్తి క్లారిటీ రానుంది. భీమ్స్ సిసిరోలియో అందించిన సంగీతం ఈ సినిమాకు పెద్ద ప్లస్ పాయింట్. ముఖ్యంగా 'వామ్మో వాయ్యో' అనే సాంగ్ ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది. రవితేజ మేనరిజమ్స్, స్టెప్పులు ఈ పాటను ఇన్స్టంట్ హిట్‌గా మార్చేశాయి. ఎస్ఎల్వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ చిత్రం భోగి పండుగ కానుకగా జనవరి 13న థియేటర్లలోకి రానుంది. ఈ సినిమాలో సునీల్ కీలక పాత్రలో నటిస్తుండగా.. ప్రసాద్ మూరెళ్ల సినిమాటోగ్రఫీ, శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్ సినిమాకు మరింత గ్రాండ్‌నెస్‌ను జోడించాయి. "ఇది కేవలం మాస్ సినిమా మాత్రమే కాదు, ప్రతి ఫ్యామిలీ ఎంజాయ్ చేసే క్లీన్ ఎంటర్టైనర్" అని చిత్ర బృందం ధీమా వ్యక్తం చేస్తోంది.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200